

నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162



ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 300 | మంగళవారం 10 - నవంబర్ - 2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,

ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్..
జనవరిలో ప్రకటనకు ఈసీ కసరత్తు!

యూపీ, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్‌లలో జరగనున్న ఎన్నికలు

షెడ్యూల్ ప్రకటనకు ముందు రాష్ట్రాల్లో పర్యటించనున్న ఈసీ పూర్తిస్థాయి బెంచ్

యూపీలో పలు దశల్లో, మిగతా రాష్ట్రాల్లో ఒకే విడతలో పోలింగ్ అంచనా

ఇప్పటికే మూడు రాష్ట్రాల్లో డిప్యూటీ కమిషనర్ల స్థాయి పర్యటనలు పూర్తి

దేశంలో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తూ, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కసరత్తును ముమ్మరం చేసింది. 2లో



తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు..
జిల్లా కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి 6 నెలల జైలు శిక్ష

రూ.2 వేల జరిమానా విధించిన హైకోర్టు

కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు నిర్ధారణ

60 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని గతంలో ఆదేశం

గడువు దాటినా స్పందించకపోవడంతో కలెక్టర్‌పై చర్యలు

2లో



ఉద్యోగులకు గుడ్ న్యూస్..
సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మార్పు..



పాత పెన్షన్ విధానానికి మారే మార్గదర్శకాలు ఖరారు
ఏపీ ఉద్యోగులకు ఓపీఎస్ అవకాశం.. జీవో విడుదల
డిసెంబర్ 31 వరకు దరఖాస్తుకు గడువు 2లో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోని అర్హులైన ఉద్యోగులు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)లోకి మారేందుకు అవసరమైన సమగ్ర విధివిధానాలను ఖరారు చేస్తూ ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నంబర్ 158ను జారీ చేసింది. అర్హత కలిగిన ఉద్యోగులు ఒకేసారి తమ ఆప్షన్ (పన్-టైమ్ ఆప్షన్) నమోదు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం మార్గదర్శకాలను అధికారికంగా విడుదల చేసింది.

రూ.500 నోట్లను రద్దు చేయాలి..

పెద్ద నోట్ల అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చిన చంద్రబాబు

రూ.100, రూ.200 నోట్లను మాత్రమే చలామణిలో ఉంచాలన్న చంద్రబాబు

పెద్ద నోట్ల రద్దు, డిజిటల్ లావాదేవీల పెంపుతోనే అవినీతికి అడ్డుకట్ట పడుతుందని స్పష్టీకరణ

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఓట్ల శాతం పెరిగిందని వెల్లడి

2024 ఎన్నికల కంటే 3.6 శాతం పెరిగి 58.9 శాతానికి చేరిందన్న సీఎం

రాష్ట్రవ్యాప్తంగా 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 575 స్థానాలను కూటమి గెలుచుకుందని వెల్లడి

100 మున్సిపల్ మేయర్, చైర్‌పర్సన్ స్థానాల్లో కూటమి 94 స్థానాలను కైవసం చేసుకుందని వివరణ

2లో



మాస్టర్ ప్లాన్ సిద్ధం!

అంతర్జాతీయ హంగులతో ఫ్యూచర్ సిటీ
71 గ్రామాలు, 1.80 లక్షల ఎకరాల్లో అభివృద్ధి
పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట
ప్లాన్ సిద్ధం చేసిన సింగపూర్ సంస్థ
తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరణ
జోన్లవారీగా భూకేటాయింపులపై స్పష్టత
లైఫ్‌సైన్సెస్ హబ్‌కు 4,000 ఎకరాలు, నివాస ప్రాంతాలకు 2,477 ఎకరాలు 2లో



అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత ఆధునిక నగరంగా రూపుదిద్దుకోనున్న 'ఫ్యూచర్ సిటీ' మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. సింగపూర్‌కు చెందిన 'డీపీ ఆర్కిటెక్ట్స్' ఈ బృహత్తర ప్రణాళికను రూపొందించింది. 7 మండలాలు, 71 రెవెన్యూ గ్రామాలు, 867 చదరపు కిలోమీటర్ల పరిధిలో.. 1.80 లక్షల ఎకరాల విస్తీర్ణంతో ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకోనుంది. త్వరలో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో దీన్ని ఆవిష్కరించనున్నట్లు సమాచారం.

ప్రజల తీర్పును గౌరవిస్తాం.. బాధ్యతగా పనిచేయాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిందన్న కేశినేని చిన్ని
కూటమి నేతల పాలనపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని వ్యాఖ్య
స్వల్ప తేడాతో ఓటమి ఎదురైనా ప్రజాతీర్పును గౌరవిస్తామని వ్యాఖ్య 2లో



ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సాధించిన ఘన విజయంపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హర్షం వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు.

జడ్పీ పీఠం ఎవరికి?



టీడీపీ, జనసేన పార్టీల మధ్య పోటాపోటీ పట్టు
ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయం సేకరణ
ఇప్పటికీ కొలిక్కిరాని పదవుల పంపకం..
రెండు రోజుల్లో వీడనున్న ఉత్కంఠ 2లో

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పీఠం ఎవరికి దక్కుతుంది? టీడీపీకా.. జనసేనకా? ఇప్పుడు జిల్లాలో కూటమి శ్రేణుల్లో ఇదే చర్చ సాగుతోంది. పరిషత్ ఎన్నికల్లో అత్యధికంగా 22 జడ్పీటీసీ స్థానాలు గెలుచుకున్న టీడీపీ జడ్పీ పీఠంపై ఆశలు పెట్టుకోగా.. 5 స్థానాల్లో విజయం సాధించిన జనసేన కూడా ఆ పదవిని కోరుతోంది. ఇప్పటికే శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ పదవిని జనసేనకు కేటాయించడంతో.. జడ్పీ పీఠమైనా తమకే ఇవ్వాలని టీడీపీ నేతలు పట్టుబడుతున్నారు. మరోవైపు ఇరు పార్టీల అభ్యర్థుల విషయంలో అధిష్ఠానం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోంది. అయినప్పటికీ పదవుల పంపకంపై స్పష్టత రాకపోవడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

టీడీపీ వాదనకు బలం జిల్లాలో మొత్తం 30 జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 22, జనసేన 5, బీజేపీ 2 స్థానాలు గెలుచుకున్నాయి. వైసీపీ ఒక స్థానానికే పరిమితమైంది. దీంతో అత్యధిక స్థానాలు సాధించిన తమకే జడ్పీ చైర్‌పర్సన్ పదవి దక్కాలన్నది టీడీపీ వాదన. ఇప్పటికే శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ పదవిని జనసేనకు కేటాయించడంతో.. కీలకమైన మరో పదవిని కూడా ఆ పార్టీకే ఇస్తే తమకు అన్యాయం జరుగుతుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు. కూటమి ధర్మంలో భాగంగా

పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా పరిగి వద్ద అడ్డుకున్న వైనం
రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందస్తుగా అరెస్టు చేసినట్లు వెల్లడి 2లో



కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళుతున్న నాయకుడిని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు.

రూ.500 నోట్లను రద్దు చేయాలి..

దేశంలో రూ.500 నోట్లను రద్దు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం మరోసారి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మార్కెట్‌లో కేవలం రూ.100, రూ.200 విలువ కలిగిన కరెన్సీ నోట్లను మాత్రమే చలామణిలో కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి డిజిటల్ కరెన్సీపై సమర్పించిన నివేదికను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. పెద్ద నోట్లను రద్దు చేయాలనే అంశంపై తాను నిరంతరం మాట్లాడుతుంటానని స్పష్టం చేశారు. "రూ.500, రూ.1,000, రూ.2,000 నోట్లను పూర్తిగా రద్దు చేయాలి. కేవలం రూ.100, రూ.200 నోట్లను మాత్రమే ఉంచాలి" అని ఆయన డిమాండ్ చేశారు. పెద్ద నోట్ల రద్దుతో నగదు వినియోగాన్ని నియంత్రించి, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం ద్వారా అవినీతిని సమర్థవంతంగా అరికట్టవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తే సంపద సృష్టి, పేదరిక నిర్మూలన కష్టమేమీ కాదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి.. ధన బలాన్ని పూర్తిగా నియంత్రించగలిగిందని చంద్రబాబు తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం కూటమి విజయాన్ని మాత్రమే కాకుండా మంచి పాలన, సామాజిక న్యాయం, నూతన నాయకత్వం, ప్రజాస్వామ్య విలువల పట్ల ప్రజలకున్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయేకు ప్రజా మద్దతు మరింత పెరిగిందని ఆయన వివరించారు. పట్టణ స్థానిక సంస్థలు, పరిషత్ ఎన్నికలు రెండింటినీ కలిపి ఎన్డీయే కూటమికి 58.9 శాతం ఓట్లు వచ్చాయని చంద్రబాబు వెల్లడించారు. 2024 ఎన్నికల్లో వచ్చిన 55.3 శాతం ఓట్లతో పోలిస్తే ఇది 3.6 శాతం పెరిగిందన్నారు. ఇదే సమయంలో వైసీపీ ఓట్ల శాతం 39.81 శాతం నుంచి 33.56 శాతానికి పడిపోయిందని, అంటే 6.25 శాతం తగ్గిందని చెప్పారు. ఫలితంగా స్థానిక సంస్థల పోరులో కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల తేడా 25.34 శాతంగా నమోదైందని వివరించారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 59.9 శాతం ఓట్లు సాధించగా, వైసీపీకి కేవలం 34.3 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయని సీఎం తెలిపారు. పట్టణాల్లో కూటమి ఏకంగా 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించిందన్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమికి 57.6 శాతం, వైసీపీకి 39.7 శాతం ఓట్లు దక్కగా.. కూటమి 87.5 శాతం స్ట్రైక్ రేట్ నమోదు చేసిందని చెప్పారు. కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల వ్యత్యాసం పట్టణాల్లో 25.6 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతంగా ఉందని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 659 జడ్పీటీసీ స్థానాల్లో కూటమి ఏకంగా 575 స్థానాలను కైవసం చేసుకుందని ముఖ్యమంత్రి చెప్పారు. మొత్తం 28 జిల్లాల్లో 27 జిల్లాల్లో కూటమి పూర్తి ఆధిపత్యం సాధించిందని, ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే వైసీపీ అధిక జడ్పీటీసీ స్థానాలు గెలుచుకుందని పేర్కొన్నారు. ఏడు జిల్లాల్లో వైసీపీ ఒక్క జడ్పీటీసీ సీటును కూడా గెలవలేకపోయిందని వివరించారు. అలాగే, 9,818 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి 7,803 స్థానాలను గెలుచుకుందని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 శాతం మండల పరిషత్ అధ్యక్ష పదవులు కూటమికే దక్కనున్నాయని తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించిందని చంద్రబాబు పేర్కొన్నారు. మొత్తం 100 మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవుల్లో కూటమి 94 స్థానాలను గెలుచుకుంది. ఇందులో 13 మేయర్ స్థానాల్లో 12 స్థానాలు, 87 ఛైర్‌పర్సన్ స్థానాల్లో 82 స్థానాలు కూటమి ఖాతాలో పడ్డాయి. పార్టీల వారీగా చూస్తే తెలుగుదేశం పార్టీ 70, జనసేన 20, బీజేపీ 4 మేయర్/ఛైర్‌పర్సన్ స్థానాలను దక్కించుకున్నాయి. మొత్తం 3,941 వార్డుల్లో కూటమి 3,233 వార్డులను (82 శాతం) గెలుచుకుంది. 100 పట్టణ స్థానిక సంస్థల్లో 95 చోట్ల కూటమి కౌన్సిల్ మెజారిటీ సాధించగా, 16 మున్సిపాలిటీల్లోని అన్ని వార్డులనూ క్లీన్ స్వీప్ చేసింది. మరోవైపు, వైసీపీ కేవలం నాలుగు పట్టణ స్థానిక సంస్థలను, 558 వార్డులను మాత్రమే గెలుచుకుందని, 22 పట్టణాల్లో ఒక్క వార్డు కూడా గెలవలేకపోయిందని ముఖ్యమంత్రి తెలిపారు.

ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్.. జనవరిలో ప్రకటనకు ఈసీ కసరత్తు!

ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను రానున్న జనవరిలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ ప్రకటనకు ముందు, ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఈసీ పూర్తిస్థాయి బెంచ్ పర్యటించనుంది.ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు కమిషనర్లతో కూడిన ఈ పూర్తిస్థాయి బెంచ్, నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్‌లో తమ పర్యటనలను ప్రారంభించే అవకాశం ఉంది. ఈ పర్యటనల సందర్భంగా రాష్ట్రాల క్షేత్రస్థాయి పరిస్థితులను, ఎన్నికల సన్నద్ధతను సమీక్షిస్తారు. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులతో ఈసీ ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను స్వీకరిస్తుంది. ఇప్పటికే డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ (డీఈసీ) స్థాయి బృందాలు పలు రాష్ట్రాల్లో పర్యటించి సన్నాహక పనులను సమీక్షించాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్ రాష్ట్రాల్లో ఈ బృందాల పర్యటనలు పూర్తయ్యాయి. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఒక దఫా పర్యటన ముగియగా, మరో రెండు పర్యటనలు జరగాల్సి ఉంది. గోవాలో డీఈసీ బృందం ఇంకా పర్యటించలేదు. నవంబర్ నెలాఖరు నాటికి ఈ బృందాలు తమ నివేదికలను ఎన్నికల సంఘానికి సమర్పించనున్నాయి. పోలింగ్‌ను ఎన్ని దశల్లో నిర్వహించాలనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదని తెలుస్తోంది. అయితే, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్ వంటి చిన్న రాష్ట్రాల్లో ఒకే దశలో పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. జనాభా పరంగా, భౌగోళికంగా పెద్దదైన ఉత్తరప్రదేశ్‌లో మాత్రం బహుళ దశల్లో ఎన్నికలు నిర్వహించే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రాల్లో పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లు, అధికారుల అభిప్రాయాలను సమగ్రంగా విశ్లేషించిన తర్వాత, షెడ్యూల్ పై ఈసీ తుది నిర్ణయం తీసుకోనుంది.

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు.. జిల్లా కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష

కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి తెలంగాణ హైకోర్టు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. రూ.2 వేల జరిమానా కూడా చెల్లించాలని ఆదేశించింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అయితే అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేసింది. రిజిస్ట్రేషన్ చట్టం–1908లోని సెక్షన్ 22–ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. వారి వినతిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని 2025 ఆగస్టులో కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. 60 రోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. అయితే గడువు ముగిసినా కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో బాధితులు 2025 అక్టోబరు 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాతే అధికారులు స్పందించారు. బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. అనంతరం జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు ఇచ్చారు. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు స్పందించడం, కోర్టు ఆదేశించిన గడువులోగా నిర్ణయం తీసుకోకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉద్దేశపూర్వకంగానే కలెక్టర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని నిర్ధారించింది. ఐఏఎస్ స్థాయి అధికారి న్యాయస్థానం ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేస్తూ ఆరు నెలల జైలు శిక్ష విధించింది.

జడ్పీ పీఠం ఎవరికి?

పదవుల పంపకం జరిగినా.. ఎన్నికల్లో సాధించిన స్థానాల ప్రాతిపదికన ప్రాధాన్యం కల్పించాలని కోరుతున్నారు. జడ్పీ పీఠాన్ని టీడీపీకే కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో పార్టీ ముఖ్యనేతలు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. మేయర్ పదవిని ఆశించి భంగపడిన కొందరు టీడీపీ నేతలు ఈ నిర్ణయంతో నిరాశకు గురయ్యారు. అయితే పదవి దక్కకపోవడంతో ఎన్నికల ఖర్చు తప్పిందన్న అభిప్రాయాన్ని కూడా కొందరు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు జనసేన నుంచి మేయర్ పదవికి పోటీ చేసేందుకు ఓ వైద్యుడు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం.

జనసేన నుంచి భవానీ పేరు జనసేన నుంచి జడ్పీ ఛైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న నాయకులు కూడా తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎల్.ఎన్.పేట జడ్పీటీసీగా గెలుపొందిన కొరికాన భవానీ పేరు ఈ రేసులో వినిపిస్తోంది. ఆమె భర్తకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ వద్ద ప్రత్యేక గుర్తింపు ఉండటంతో.. తన భార్యకు జడ్పీ ఛైర్‌పర్సన్ పదవి ఇవ్వాలని ఆయన కోరుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

టీడీపీ నుంచి సుజాత పేరు టీడీపీ తరఫున ఆమదాలవలస జడ్పీటీసీగా గెలుపొందిన తమ్మినేని సుజాత పేరు ఛైర్‌పర్సన్ పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. పీయూసీ ఛైర్మన్ బలపరిచిన ఆమె అభ్యర్థిత్వానికి కూన రవికుమార్‌తో పాటు పలువురు పార్టీ నేతలు మద్దతు తెలుపుతున్నారు. జడ్పీ పీఠం కోసం టీడీపీ నుంచి ప్రధానంగా సుజాత పేరు మాత్రమే తెరపైకి రావడంతో ఐవీఆర్ఎస్ ద్వారా సేకరిస్తున్న అభిప్రాయాల్లోనూ ఆమెకు మద్దతు లభిస్తున్నట్లు తెలుస్తోంది. సుజాత కాళింగ సామాజికవర్గానికి చెందినవారు కావడంతో సామాజిక సమీకరణాలు కూడా ఆమెకు కలిసివస్తాయని టీడీపీ నేతలు భావిస్తున్నారు. రాజకీయ ప్రాధాన్యంతో పాటు సామాజిక న్యాయం పాటించినట్లవుతుందని అభిప్రాయపడుతున్నారు.

నిర్ణయంపై ఉత్కంఠ శ్రీకాకుళం టీడీపీకి బలమైన పట్టున్న జిల్లా. ఈ నేపథ్యంలో మిత్రపక్షాల మధ్య పదవుల పంపకంలో సమతుల్యత పాటించాలని టీడీపీ శ్రేణులు కోరుతున్నాయి. మేయర్ పదవిని జనసేనకు కేటాయించిన నేపథ్యంలో జడ్పీ పీఠం టీడీపీకి దక్కితేనే రెండు పార్టీల మధ్య సమన్వయం కొనసాగుతుందని భావిస్తున్నారు. అధిష్ఠానం ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యం ఇస్తుందా? లేక ఇరు పార్టీల నేతల ఒత్తిళ్లకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. రానున్న నగరపాలక సంస్థ, పంచాయతీ ఎన్నికలపై కూడా ఈ నిర్ణయం ప్రభావం చూపనుందని ఇరు పార్టీల నేతలు భావిస్తున్నారు. మరో రెండు రోజుల్లో జడ్పీ పీఠంపై అధిష్ఠానం నిర్ణయం వెలువడే అవకాశం ఉండడంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది.

వనపర్తి జిల్లాలో 900 ఏళ్ల నాటి శాసనం.. వెలుగులోకి చారిత్రక నిజాలు

వనపర్తి జిల్లా కోటకొండలో 12వ శతాబ్దపు శాసనం గుర్తింపు

కల్యాణి చాళుక్య చక్రవర్తి ఆరవ విక్రమాదిత్యుడి కాలం నాటిదిగా నిర్ధారణ

భూదానాల వివరాలను వెల్లడించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం

తెలుగన్నడ లిపిలో ఉన్న ఈ శాసనాన్ని చదివి విశ్లేషించిన హరగోపాల్

తెలంగాణ చారిత్రక సంపదలో మరో కీలక ఆధారం వెలుగులోకి వచ్చింది. వనపర్తి జిల్లా, కోటకొండలోని ఒక శివాలయంలో సుమారు 900 ఏళ్ల నాటి పురాతన శాసనాన్ని చరిత్రకారులు గుర్తించారు. ఇది కల్యాణి చాళుక్య చక్రవర్తి ఆరవ విక్రమాదిత్యుడి (త్రిభువనమల్ల దేవుడు) కాలం నాటిదని నిర్ధారించారు. ఇప్పటివరకు ఎవరికీ అంతుచిక్కని ఈ శాసనాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు వెలుగులోకి తెచ్చారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు బైరోజు చంద్రశేఖర్, డా. బైరోజు శ్యామ్ సుందర్, హనుమానగరి వేమారెడ్డి, పంద్రప్రగ్గడ రామారావు ఈ శాసనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేశారు. బృందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ దీనిని చదివి చారిత్రక వివరాలను విశ్లేషించారు.

శాసనంలో ఏముందంటేఈ శాసనాన్ని క్రీ.శ. 1118 మే 22న వేసినట్లు గుర్తించారు. ఇది 12వ శతాబ్దపు తెలుగన్నడ లిపిలో, కన్నడ భాషలో ఉంది. శాసనం ప్రకారం, కాలాబోలవిరనోలబ మల్లదేశారెడ్డి అనే అధికారి, కదిరాజ అనే పూజారి పాదాలను కడిగి, సింగణగదనకొలను అనే ప్రాంతంలో 3 మత్తరుల తడి భూమిని దానంగా ఇచ్చినట్లు స్పష్టంగా ఉంది. శాసన స్తంభంపై 'త్రిభువనమల్ల దేవ' అనే పేరు ఉండటంతో ఇది విక్రమాదిత్యుడి కాలం నాటిదని ధ్రువీకరించారు. శిలాఫలకం మరోవైపు 'రామేశ్వర పండిత', 'సూర్యగ్రహణం' అనే పదాలు ఉన్నప్పటికీ, ఆ భాగం కొంత శిథిలమైంది. శ్రీ నాయక అనే మరో అధికారి కూడా భూదానం చేసినట్లు ఇందులో రాశారు. శాసనం ఉన్న స్తంభం మధ్యలో విరిగిపోయి ఉంది. ఇదే ఆలయంలో కాకతీయ శైలిలో ఉన్న చదునైన పానవట్టం (శివలింగం కింది భాగం)తో కూడిన శివలింగం, చాళుక్యుల శైలి నంది, గణపతి విగ్రహాలు, 16వ శతాబ్దానికి చెందిన భక్త ఆంజనేయ విగ్రహం ఉండటం విశేషం. ఈ శాసనం తెలంగాణ ప్రాంతంలో కల్యాణి చాళుక్యుల పాలన, వారి కాలం నాటి భూదానాల సంప్రదాయాలకు బలమైన చారిత్రక సాక్ష్యంగా నిలుస్తుందని పరిశోధకులు తెలిపారు.



ఒక ప్రాథమిక హక్కు కోసం మరో ప్రాథమిక హక్కుని కోల్పోవాలా?

కులం, మతం లాంటి అస్తిత్వాలు సామాజికరాజకీయఆర్థిక చట్రంలో ఒక విధంగా పనిచేస్తే, న్యాయ, పరిపాలనా రంగాల్లో మాత్రం వాటి అర్థాలు, చరిత్రలు ప్రత్యేక రూపాలు తీసుకుంటాయి. ఈ విషయం అక్టోబర్ 15న 'ది సెక్రటరీ టు గవర్నమెంట్ వర్సెస్ సమీర్ అహ్మద్ అండ్ అదర్స్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా మరొక్కసారి తేటతెల్లం అయ్యింది. తమిళనాడులో ట్యూటికొరిన్ జిల్లాకి చెందిన సమీర్ అహ్మద్ హిందూ మతంలో వెనుకబడిన తరగతులకి చెందిన ఒక కులంలో జన్మించారు. 2015లో ఇస్లాం మతం తీసుకున్నారు. తర్వాత ఇస్లాం మత ఆచారాల ప్రకారమే పెళ్లి చేసుకున్నారు. తమిళనాడులో కొన్ని ముస్లిం సమూహాలని వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చారు. అందులో 'లెబెయ్' ఒకటి. వీరు చారిత్రకంగా వర్తకులు. తనను ఆ సమూహానికి చెందినవాడిగా గుర్తిస్తూ, వెనుకబడిన తరగతుల ధ్రువీకరణ పత్రం ఇవ్వమని సమీర్ అహ్మద్ 2020లో స్థానిక తహసీల్దారుకి అర్జీ పెట్టుకున్నారు. అయితే అతను కేవలం మతం మారాడే కానీ కులం కాదు కాబట్టి ఇవ్వటం కుదరదని తహసీల్దార్ తిరస్కరించారు. ఈ నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌లో 2022లో సమీర్ అహ్మద్ సవాలు చేశారు. ఈ కేసు అక్కడ ఉండగానే 2024లో తమిళనాడు ప్రభుత్వం ఒక ఉత్తర్వు విడుదల చేసింది. హైందవ మతం నుంచి ఎవరైనా ఇస్లాంలోకి మారితే, వారికి వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చిన ఏదైనా సమూహానికి చెందిన వ్యక్తిగా ధ్రువీకరణ పత్రం ఇవ్వవచ్చునని ఈ ఉత్తర్వు సారాంశం. దీని ప్రకారం సమీర్ అహ్మద్‌కి తాను కోరుకున్న లెబెయ్ ధ్రువీకరణ పత్రం సమకూరుతుంది. అయితే మద్రాస్ హైకోర్టు 2026లో ఈ ప్రభుత్వ ఉత్తర్వుని కొట్టివేసింది. పర్యవసానంగా సమీర్ అహ్మద్ కేసును కూడా కొట్టివేసింది. ఈ తీర్పుని తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. 'ఇస్లాం ధర్మశాస్త్రం అసమానతను వ్యతిరేకించినా కూడా వాస్తవంగా ఇస్లాంలో కూడా వర్ణకుల వ్యవస్థలని తలపించే సోపానుక్రమ కట్టుబాట్లు ఉన్నాయని, అయితే వాటి ఆధారం హైందవ ధర్మంలో లాగా మతంలో లేదని, అవి చారిత్రకంగా ఏర్పడిన కట్టుబాట్లు' అని వివిధ అకడెమిక్ పేపర్లని ఉటంకిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. అదే విధంగా రాజ్యాంగంలో వెనుకబడిన తరగతులు అనే కేటగిరీకి కులం ఒక్కటే ప్రాతిపదిక కాదని 35 ఏళ్ల క్రితం సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇందిరా సాహ్నే కేసులో ఇచ్చిన తీర్పును కూడా ఉటంకించింది. అయితే ప్రస్తుత ప్రశ్న హైందవేతర మతాలలో వెనుకబడిన తరగతులు ఉన్నాయా లేవా అని కాదు. అవి కచ్చితంగా ఉన్నాయి కాబట్టే అనేక రాష్ట్రాలలో ఇస్లాంలోని వివిధ సమూహాలని వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చారు. ఇక్కడ ప్రశ్న హైందవ మతానికి సంబంధించిన వెనుకబడిన తరగతుల కులం నుంచి హైందవేతర మతంలోకి ముఖ్యంగా ఇస్లాంలోకి మారినప్పుడు ఆ మతానికి సంబంధించిన వెనుకబడిన తరగతుల జాబితాలో ఉన్న ఏదైనా సమూహానికి సదరు వ్యక్తి చట్టబద్ధంగా భాగం అవుతారా లేదా అన్నది. ఈ తీర్పులో సుప్రీంకోర్టు అవ్వరు అని స్పష్టం చేసింది. హైందవ మతంలోని ఒక కులం నుంచి ఇస్లాం మతంలోకి మారినప్పుడు అందులో కులం లాంటి సమూహంలో భాగం అవ్వడానికి కుదరదు అనీ, అందుకు ఈ సమూహంలో పుట్టి పెరిగి ఉండవలసిన అవసరం ఉంది అనీ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దీనితో పేచీ ఉండవలసిన పని లేదు. ఏదైనా కులాన్ని లేదా సమూహాన్ని వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చారు అంటే, ఆ కులం లేదా సమూహం చారిత్రక కారణాల చేత వెనుకబడింది కాబట్టి అందులో చేర్చారు అని. ఆ నిర్దిష్ట కులం లేదా సమూహం చారిత్రక పరిణామంలో భాగం కాకుండా, ఈ వెనుకబాటుతనానికి గురికాకుండా, ఆ జాబితాలో భాగం అవుతాను అని కోరడం అసంబద్ధమే అవుతుంది.అయితే, సుప్రీంకోర్టు ఇక్కడ చేసిన కొన్ని సూత్రీకరణలు మాత్రం ఇబ్బందికరమైనవి. హైందవ మతం నుంచి హైందవేతర మతంలోకి మారినప్పుడు ఆర్థిక, విద్య, ఉద్యోగ తదితర వెనుకబాటుతనం అలాగే ఉండవచ్చేమో కానీ హైందవ మతంలో కులం ఆధారంగా ఏర్పడిన వెనుకబాటుతనం అక్కడ ఉండదు కాబట్టి ఇక్కడ ఉన్న రిజర్వేషన్లు అక్కడ కోరుకోవడం కుదరదు అని చెప్పింది. పైన ఒక చోటేమో వెనుకబాటుతనానికి కులం కేవలం ఒక ప్రాతిపదిక అని చెప్పి, ఇక్కడ కులమే పునాది అని చెప్పటం ఎంతవరకు సబబు? హైందవేతర మతాల ధర్మశాస్త్రాలలో కులానికి చోటు లేదు కాబట్టి ఆయా మతాలలో అసమానతకి కులం పునాది అవ్వదు అని సుప్రీంకోర్టు చెప్పటమంటే వాస్తవిక పరిస్థితిని కాదని వేల ఏళ్ల ధర్మశాస్త్రాలని రాజ్యాంగ నిర్ణయాలకి ఆధారం చేసుకోవడమే అవుతుంది. ఇది క్రైస్తవ మతం విషయంలో చాలా ఇబ్బందికరమైన సూత్రీకరణ అవుతుంది. ఇదే సూత్రీకరణని అడ్డుపెట్టుకుని ఈనాటికీ దళిత క్రైస్తవ, దళిత ముస్లింలకి షెడ్యూల్డ్ క్యాస్ట్ రిజర్వేషన్లని నిరాకరిస్తున్నారు. ఈ అసంబద్ధ మత ప్రాతిపదికని తొలగించాలని ప్రభుత్వ కమిషన్లే గత 40 ఏళ్లుగా సిఫార్సు చేస్తూ వచ్చాయి.సుప్రీంకోర్టే గత 75 ఏళ్లలో అనేకానేక తీర్పులలో కులానికి మతానికి అవినాభావ సంబంధం ఉండవలసిన అవసరం లేదనీ, అటువంటి సంబంధం సామాజిక వాస్తవంగా కూడా లేదనీ చెప్పింది. ఇది ముఖ్యంగా క్రైస్తవ మతం నేపథ్యంలో చెప్పినా, ఇస్లాం మతానికి కూడా ఈ సూత్రీకరణని అన్వయిస్తూ సుప్రీంకోర్టు అనేకమార్లు వ్యాఖ్యానించింది. ఇప్పుడు అటువంటి సామాజిక వాస్తవ వ్యాఖ్యానాన్ని తిరగదోడి ధర్మశాస్త్రాలకి ప్రాధాన్యం ఇచ్చినట్టు అయ్యింది. ఈ ప్రస్తుత వ్యాఖ్యానానికి మద్దతుగా సుప్రీంకోర్టు 1950 నాటి షెడ్యూల్డ్ క్యాస్ట్ ఆర్డర్‌ను ఉటంకించింది. అయితే షెడ్యూల్డ్ క్యాస్ట్ అనేది అస్పృశ్యత అనే ఒక ప్రత్యేకమైన ఉమ్మడి సామాజిక వాస్తవికత ఆధారంగా తీసుకువచ్చిన కేటగిరీ. దానిని వెనుకబడిన తరగతుల కేటగిరికీ అన్వయించడం రాజ్యాంగపరంగా కూడా ఇబ్బందికరమైన విషయం. ఈ విషయాన్ని మత స్వేచ్ఛ నేపథ్యం నుంచి కూడా చూడవలసిన అవసరం ఉంది. ఇటువంటి సూత్రీకరణలు ఒక రకంగా మత స్వేచ్ఛకి సంకెళ్లు వేసినట్టే. ఒకరు స్వచ్ఛందంగా, మనస్ఫూర్తిగా మతం మారాలి అనుకున్నా కూడా ముఖ్యంగా వెనుకబడిన తరగతులకి చెందినవారు ఈ సూత్రీకరణల నేపథ్యంలో తమకి రాజ్యాంగబద్ధంగా, చారిత్రకంగా దఖలుపడిన రిజర్వేషన్ హక్కుని వదులుకోవలసిన పరిస్థితి. ఒక ప్రాథమిక హక్కు కోసం మరొక ప్రాథమిక హక్కుని కోల్పోవలసిన స్థితి ఏర్పడుతుంది. ప్రాథమిక హక్కులని ఒక దానితో ఒకదానిని అన్వయిస్తూ రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించాలి అనేది ఒక న్యాయశాస్త్ర సూత్రం. దానికి ఇప్పుడు అడ్డంకులు ఎదురయ్యే పరిస్థితి ఉంటుంది. ఇన్ని అంశాలు ఇమిడి ఉన్న ఈ తీర్పులోని సూత్రీకరణలని మరొక్కసారి సమీక్షించవలసిన అవసరం ఉంది.

ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కీలక ఫోన్ సంభాషణ

రష్యా–ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ సంక్షోభాన్ని కేవలం చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ సోమవారం సాయంత్రం ప్రధాని మోదీతో టెలిఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన వివరాలను భారత ప్రధానమంత్రి కార్యాలయం అధికారికంగా విడుదల చేసింది. పీఎంఓ ప్రకటన ప్రకారం.. రష్యాతో నెలకొన్న ప్రస్తుత యుద్ధ పరిణామాలపై తన అభిప్రాయాలను అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రధాని మోదీతో పంచుకున్నారు.

ఉద్యోగులకు గుడ్ న్యూస్.. సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మార్పు..

ఈ నిర్ణయంతో 2004 సెప్టెంబర్ 1కి ముందు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలై, ఆ తేదీ తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారితో పాటు, అప్పటికే పదవీ విరమణ పొందినవారు, మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కూడా ఈ వెసులుబాటు వర్తిస్తుంది. దాదాపు 10,715 మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు దీనివల్ల లబ్ధి చేకూరనుంది. ఓపీఎస్‌కు మారాలనుకునే అర్హులు 2026 డిసెంబర్ 31వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా తమ ఆప్షన్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని 'నిధి' పోర్టల్ ద్వారానే నిర్వహిస్తారు. ఇందుకోసం ఉద్యోగులు తమ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్, ఎంపిక జాబితా, నియామక ఉత్తర్వులు, జాయినింగ్ ఆర్డర్ కాపీలను జతచేయాల్సి ఉంటుంది. ఓపీఎస్ ఎంచుకున్న ఉద్యోగులకు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాను ప్రారంభిస్తారు.

ప్రజల తీర్పును గౌరవిస్తాం.. బాధ్యతగా పనిచేయాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంపై రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని కేశినేని చిన్ని అన్నారు. కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తల సమన్వయంతోనే ఈ భారీ విజయం సాధ్యమైందని ఆయన తెలిపారు. విజయవాడతో పాటు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు ఎంతో ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ముగిశాయని చెప్పారు. కొన్ని స్థానాల్లో ఫలితాల గురించి మాట్లాడుతూ... "నాలుగు ఓట్ల తేడాతో ఒక ఎంపీటీసీ స్థానాన్ని కోల్పోయాం. మరో స్థానంలో కేవలం ఎనిమిది ఓట్ల తేడాతో ఓటమి చెందాం. స్వల్ప తేడాతో ఓడినా ప్రజల తీర్పును గౌరవించాం" అని ఎంపీ పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు: కేటీఆర్

వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలోని బహార్‌పేట్ చౌరస్తా వద్ద పోలీసులు పట్నం నరేందర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోస్గిలో మరణించిన ఓ బీఆర్ఎస్ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నందున, ముందస్తు జాగ్రత్త చర్యగానే నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ అరెస్టుతో ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసు వాహనాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "పరామర్శించేందుకు వెళుతున్న నాయకుడిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది? బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా? నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాంగ్రెస్ పార్టీ పాలనగా మార్చుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదు. ప్రజల, కార్యకర్తల పక్షాన పోరాటం కొనసాగుతుంది. పట్నం నరేందర్‌రెడ్డిని ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు. మరోవైపు, పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా ఖండించారు. ప్రతిపక్ష నేతలను అకారణంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

గుండెపోటు అనుకుంటే హత్య: ప్రియుడితో కలిసి భర్తను అంతమొందించిన భార్య

బెంగళూరులో ఓ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న కారణంతో ప్రియుడితో కలిసి భర్తను హతమార్చి, దానిని గుండెపోటుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన భార్యను, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎలక్ట్రానిక్ సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని దొడ్డతొగురులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉపేంద్ర (41), అనిత (36) దంపతులు. అనితకు వారి స్వగ్రామానికే చెందిన మధుసూదన్ రెడ్డి (46)తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఉపేంద్ర వారిద్దరినీ తీవ్రంగా హెచ్చరించాడు. దీంతో తమ బంధానికి అడ్డుగా ఉన్న ఉపేంద్రను అంతమొందించాలని అనిత, మధుసూదన్ నిర్ణయించుకున్నారు.

చెత్త వేస్తున్న ప్రాంతాల్లో అవగాహన కల్పించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

ప్రభుత్వాసుపత్రిలో చెత్త సేకరణలో లోపాలు ఉండరాదు



కర్నూలు సిటీ నందిపత్రిక నగరంలోని రహదారులు, ఖాళీ స్థలాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల ప్రజలకు చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని, ఇంటింటి చెత్త సేకరణకు ప్రజలు సహకరించేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. సోమవారం గిప్సన్ కాలనీ, బిర్లా గేట్, కృష్ణ నగర్, చెన్నమ్మ సర్కిల్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం కల్లూరు వార్డు కార్యాలయంలో నీటి సరఫరా, మరమ్మతులకు సంబంధించి ఇటీవల తెప్పించిన సామగ్రిని పరిశీలించారు.ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన కమిషనర్‌ను ఆసుపత్రి పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బంది, చెత్త సేకరణలో ఎదురవుతున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన కమిషనర్ సంబంధిత పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడి, ఆసుపత్రిలో ప్రతిరోజూ రెండు పర్యాయాలు చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సెలవు దినాల్లో సైతం చెత్త సేకరణకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు.కార్యక్రమంలో ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జయన్న, జిలానీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు కాంట్రాక్టర్ల అభినందనలు



కర్నూలు సిటీ నందిపత్రిక ఇటీవల కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన కమిషనర్ చల్లా ఓబులేసును కాంట్రాక్టర్లు అభినందించారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో కమిషనర్‌ను కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, వసతుల కల్పనలో కాంట్రాక్టర్లు ఎంతో శ్రమించారని, ఎన్నికలు విజయవంతం కావడంలో వారు సైతం తమ వంతు పాత్ర పోషించారని కమిషనర్ కొనియాడారు. కాంట్రాక్టర్లు మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో హడావుడికి తావులేకుండా ముందస్తు ప్రణాళికతో ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ, ఎన్నికలు విజయవంతం కావడంలో కమిషనర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఎన్నికల ఏర్పాట్ల కోసం రాత్రింబవళ్లు శ్రమించారని అభినందించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు ఎం.మనోహర్ రెడ్డి, షరీఫ్, ఎండీ రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయాన్ని జీర్ణించుకోలేక గొడ్డలి పార్టీ అసత్య ఆరోపణలు

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ



కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రతిపక్షాల ఆరోపణలను ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగానే ఎన్నికలు జరిగాయని, ప్రజల తీర్పును గౌరవించాలని హితవు పలికారు. కూటమి విజయాన్ని జీర్ణించుకోలేక గొడ్డలి పార్టీ నాయకులు అసత్య ప్రచారాలకు దిగుతున్నారని విమర్శించారు. పాణ్యంలో బనగానపల్లి రాజకీయాలు చెల్లవని, ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికే పట్టం కడతారని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని, రాజకీయ విమర్శలకు అభివృద్ధి పనులతోనే సమాధానం చెబుతామని తెలిపారు. 2029లోనూ కూటమి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏపీ విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, సంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ,అర్బన్ వార్డుల కూటమి పార్టీ కార్పొరేటర్లు, ఇన్‌చార్జులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దిగొచ్చిన క్యాన్సర్ మందుల ధరలు..

కొత్త ధరలు నేటి నుంచే అమలు

దేశవ్యాప్తంగా క్యాన్సర్ రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ప్రాణాంతక క్యాన్సర్ చికిత్సలో అత్యంత కీలకమైన మందుల ధరలను భారీగా తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం సోమవారం (2026 నవంబర్ 9) నుంచి అధికారికంగా అమల్లోకి వచ్చింది. జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) క్యాన్సర్ నిరోధక మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయడంతో, మార్కెట్లో లభించే దాదాపు 1,364 రకాల ఔషధ ఫార్ములేషన్ల గరిష్ఠ చిల్లర ధరలు (ఎంఆర్‌పీ) గణనీయంగా తగ్గాయి. నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎన్‌పీపీఏ ఈ చర్యలు చేపట్టింది. మొత్తం 85 ఫార్మా కంపెనీలకు చెందిన 121 రకాల క్యాన్సర్ ఔషధాలు ఈ తాజా ధరల తగ్గింపు పరిధిలోకి వచ్చాయి. వీటిలో 679 బ్రాండ్ల ధరలు ఏకంగా 50 శాతం కంటే ఎక్కువగా తగ్గగా, కొన్ని మందులపై అత్యధికంగా 96.45 శాతం వరకు తగ్గింపు నమోదైంది.

శ్రీ మద్దిలేటి స్వామి దేవస్థానంలో వైభవో పేతంగా స్వాతి నక్షత్ర వేడుకలు.



బేతంచెర్లనవంబర్9(నందిపత్రిక). శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్రాన్ని పురస్కరించు కుని శ్రీ స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో నిర్వహించారు. స్వాతి నక్షత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆరాధనకు విశేష ప్రాధాన్యత కలిగిన శుభ దినం కావడంతో దేవస్థానంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వేదపండితులు,అర్చకులు వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి విశేష అభిషేకాలు,అర్చనలు,ప్రత్యేక పూజలు నిర్వహించి లోకక ల్యాణం,సకల జనుల సుఖ శాంతులు,ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు.ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థానం చైర్మన్ శ్రీ ఉన్నం ఎల్లనాగయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, పూజా కార్యక్రమాల్లో భక్తి పూర్వకంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి శ్రీ స్వామివారి దివ్య మంగళ ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమాలు దేవస్థానం ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించ బడ్డాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ మూర్తిని సర్వాలంకార భూషితునిగా అలంకరించి మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణలు, భక్తుల హరినామ స్మరణల నడుమ దేవస్థాన పురవీధుల్లో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. స్వామివారి దర్శనంతో భక్తులు పరవశించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాలకు ప్రతీకగా స్వాతి నక్షత్ర మహోత్సవం భక్తజనుల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచింది. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య కృపాకటాక్షాలు సర్వలోకాలకు కలగాలని ఈ సందర్భంగా ప్రార్థించారు.

ప్రజల ఆదరణే తెలుగుదేశం పార్టీ విజయానికి బలం : డా.మాచాని సోమనాథ్



ఎమ్మిగనూరు అక్టోబర్ 9 (నంది పత్రిక) రాష్ట్ర టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి డా.మాచాని సోమనాథ్ పత్రికా సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలైన మున్సిపల్, ఎంపిటిసి మరియు జడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అఖండ విజయాన్ని అందించి, తమ అమూల్యమైన ఓటుతో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించిన ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు.అలాగే స్థానిక సంస్థలు ఎన్నికలలో కౌన్సిలర్ మరియు ఎంపిటిసి, జడ్పీటీసీగా ఎన్నికైన వారికి శుభాభినందనలు అదేవిధంగా, రాబోయే గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఆదరించి, అఖండ మెజారిటీతో గెలిపించి, అభివృద్ధి ప్రస్థానాన్ని కొనసాగించాలని ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాము అని తెలియజేశారు.

అమ్మవారి దర్శనానికి వెళుతూ ప్రమాదంలో మహిళ దుర్మరణం

ఏ నిమిషానికి ఏమి జరుగునో
ఎవరూహించెదరు... విధివిధానమును
తప్పించుటకై ఎవరు సాహసించెదరు...
అని కవి కొసరాజు రాఘవయ్య
రాసినట్లుగా.. ఎప్పుడు ఏమి జరుగుతుందో
ఊహించడం కష్ట సాధ్యమే అవుతుంది. దైవ
దర్శనానికి వెళుతున్న ఓ కుటుంబం
ప్రమాదానికి గురైంది. శునకం రూపంలో
మృత్యువు వచ్చి ఓ కుటుంబాన్ని
విషాదంలోకి నింపింది. ఇందుకు
సంబంధించి వివరాల్లోకి వెళితే....



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 9: వెలుగోడు మండలం గుంతకందాల గ్రామానికి చెందిన జంగం విజయుడు ఓ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జంగం విజయుడు, అతని భార్య సోమేశ్వరమ్మ (40) తోపాటు తల్లి శారదమ్మతో కలిసి నంద్యాలలోని జగజ్జనని ఆలయంలో పూజలు నిర్వహించేందుకు గుంతకందాల గ్రామం నుండి ఆటోలో బయలుదేరారు. బండి ఆత్మకూరు మండలం పెద్దదేవలాపురం గ్రామానికి వస్తున్న సమీపంలో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ఓశునకం ఆటోగా అడ్డుగా వచ్చింది. దీంతో విజయుడు కుక్కను తప్పించబోయే ప్రయత్నంలో ఆటో వెళ్లి పక్కనే ఉన్న గోడకు గుద్దుకుంది. ఆటోలో ఉన్న విజయుడు భార్య సోమేశ్వరమ్మ గోడకు తల గుద్దుకొని ఆటోలో నుండి ఎగిరి పడింది. తలకు రక్త గాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఆటోలో ఉన్న తల్లి శారదమ్మకు కాలు విరుగగా, విజయుడు కూడా మూగ దెబ్బలకు గురయ్యాడు. దైవదర్శనానికి వెళుతూ ప్రమాదానికి గురి అయ్యి ఆ కుటుంబం విషాదఛాయల్లో నింపింది. సోమవారం తెల్లవారుజామున ఈ సంఘటన తెలిసిన వెంటనే, పెద్దదేవలాపురం గ్రామానికి చెందిన ప్రజలు, అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న భక్తులు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన సంఘటనపై విషాదం వ్యక్తం చేశారు. సంఘటన తెలిసి వెంటనే బండి ఆత్మకూరు పోలీసులు పెద్దదేవలాపురం గ్రామానికి చేరుకున్నారు. సోమేశ్వరమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను సైతం చికిత్స నిమిత్తం నంద్యాల కు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కలను నియంత్రించడంలో అధికారుల వైఫల్యం

బండి ఆత్మకూరు మండలంలో వీధి కుక్కలను నియంత్రించడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారు. బండి ఆత్మకూరు, ఏ కోడూరు ,పార్నపల్లె, సంత జూటూరు గ్రామాలలో వీధి కుక్కలు విజృంభిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలలో వెళుతున్న వ్యక్తులను కుక్కలు వెంబడిస్తున్నారు, గాయాల పాలు చేస్తున్నాయి. కుక్కలను గ్రామాలలో నుండి నియంత్రించాలని పలుమార్లు అధికారులకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం మాత్రం శూన్యం. ప్రజలు కుక్కకాటులకు గురి అవుతున్న ప్పటికీ, ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు ప్రత్యక్షంగా కనపడుతున్నప్పటికీ వాటిని నియంత్రించడంలో ఘోరంగా విఫలమవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పెద్దదేవలాపురం గ్రామం వద్ద ఆటోకు కుక్క అడ్డు రావడంతో, కుక్కను తప్పించబోయి ప్రమాదానికి గురై ఓ మహిళ నిండు ప్రాణం బలైపోయింది. ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకొని అయినా అధికారులు కళ్ళు తెరిచి కుక్కలను నియంత్రించడంలో చర్యలు చేపట్టాలని అన్ని గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

“రేడియాలజీ పితామహుడు విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్‌జెన్ సేవలు చిరస్మరణీయం

రాంట్‌జెన్ విగ్రహానికి పూలమాల వేసి వారి సేవలు స్మరించుకున్న అడిషనల్ డీఎమ్ఈ లు డా. చిట్టి నరసమ్మ, డా. వెంకటేశ్వర్లు



కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూల్ మెడికల్ కాలేజీలో సోమవారం రేడియాలజీ విభాగంలో ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎక్స్‌రేలను కనుగొన్న శాస్త్రవేత్త, రేడియాలజీ పితామహుడు విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్‌జెన్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అదనపు డీఎంఈ లు డాక్టర్ కె. చిట్టి నరసమ్మ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు రాంట్‌జెన్ విగ్రహానికి పూలమాలలు వేసి వారి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 8వ తేదీన ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవం (వరల్డ్ రేడియోగ్రఫీ డే) నిర్వహిస్తున్నామని, 1895 నవంబర్ 8న ఆయన ఎక్స్‌రేలను కనుగొన్నారని ఎక్స్‌రేలను కనుగొన్న జర్మన్ భౌతిక శాస్త్రవేత్త విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్‌జెన్ (విలహేలం కనరాడ్ రొంట్జన్) గౌరవార్థం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు.వైద్యరంగంలో ఎక్స్‌రే సాంకేతికత ఆవిష్కరణ వ్యాధుల నిర్ధారణలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందని, నేటి ఆధునిక వైద్య విధానాల్లో రేడియాలజీ విభాగం కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో రేడియాలజి విబాగాధిపతి డా. పద్మలత, డిసిఎస్ డా. వెంకట రమణ, రేడియాలజీ ప్రొఫెసర్స్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ లు పాల్గొన్నారు.

37 వ వార్డు నైతిక గెలుపు మాది, అధికారిక గెలుపు కూటమిది.

సంజన్న కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు

ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి కాశపోగు సూరి

కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు నగరంలోని 37 వ వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థి కాశపోగు లక్ష్మీదేవి గెలుపు నైతికంగా మాదేనని, అధికార విజయాన్ని అధికార కూటమి ప్రభుత్వం దక్కించుకుందని ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి కాశపోగు సూరి, మాజీ కార్పొరేటర్ కాశ పోగు జయ రాముడు, తెలిపారు. కర్నూల్ నగరంలోని షరీన్ నగర్ వారి కార్యాలయంలో కార్యకర్తల కృతజ్ఞత కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్వర్గీయ కాశాపోగు సంజన్న చిత్రపటానికి పూలమాలు వేసి సంజన్న అమర్ రహే సంజన్న ఆశయ సాధనకు కృషి చేస్తాం, సంజన్న కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని నినాదాలు చేశారు. షరీన్ నగర్ లో ప్రజల భద్రతకు, ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా సంజన్న ఎంతో కృషి చేశారని, సంజన అడుగుజాడల్లో నడుస్తామని పలువురు చెప్పారు.37 వార్డు ప్రజలు సంజన కుటుంబ సభ్యులకు నైతిక గెలుపు కు పాటుపడిన ప్రతి ఒక్కరికి సంజన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజలతో ప్రత్యక్ష సంభాషణే పరిష్కార మార్గం

ఫిర్యాదుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలోకి వెళ్లాల్సిందే

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 18 అర్జీలు

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు ప్రజలతో ప్రత్యక్ష సంభాషణే అత్యంత ప్రభావవంతమైన మార్గమని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. ప్రజల నుంచి వివిధ రూపాల్లో అందుతున్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 18 అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, ఎస్.ఈ. రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డిసిపి శబ్నం శాస్త్రి, ఏసీపీ నాగరాజు, కార్యదర్శి నాగరాజు, మేనేజర్ జునైద్, ఆర్వోలు క్రిస్టోఫర్, వాజిద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పదవిని వీడే ముందు భారీగా క్షమాభిక్షలు: ట్రంప్ సంచలన ప్రకటన

తాను పదవి నుంచి వైదొలగడానికి ముందు భారీ సంఖ్యలో క్షమాభిక్షలు ప్రసాదిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. తన ప్రభుత్వంలో పనిచేసిన వారు భవిష్యత్తులో రాజకీయ కక్షసాధింపులకు గురికాకుండా కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఒక ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. “అధికారం నుంచి దిగిపోయే ముందు మీరు పెద్ద ఎత్తున క్షమాభిక్షలు ఇస్తారా?“ అని అడగ్గా.. “అవును, కచ్చితంగా ఇస్తాను. భారీ సంఖ్యలో క్షమాభిక్షలు మంజూరు చేయాలని భావిస్తున్నాను“ అని ట్రంప్ సమాధానమిచ్చారు. తన హయాంలో పనిచేసిన అధికారులు, సిబ్బంది తమ జీవితాంతం రాజకీయ ప్రత్యర్థులతో న్యాయపోరాటాలు చేయాల్సిన అవసరం లేకుండా చూడటమే తన ఉద్దేశమని వివరించారు.

పౌరుషానికి మరో పేరే 'మాలలు'





మాలలు ఐక్యమత్యం గా ఉంటే ఏదైనా సాధ్యమే..

ఎస్సీ వర్గీకరణలో.. మాలల మౌనమే..

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వణుకు..

మాల మహానాడు నంద్యాల జిల్లా నూతన కమిటీకి ప్రత్యేక అభినందనలు

మాల మహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మేకల లింగస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజ్ కుమార్.

నంద్యాల బ్యూరో, నవంబర్09(నంది పత్రిక):- భారతదేశ చరిత్రలో పౌరుషానికి మరో పేరే మాలలని మాల మహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మేకల లింగస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజ్ కుమార్ లు అన్నారు. సోమవారం పట్టణంలోని నూనె పల్లె ప్రాంతంలో నూతన మాల మహానాడు జిల్లా కార్యాలయాన్ని వారు ప్రారంభించి, జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మాల మహానాడు నంద్యాల జిల్లా అధ్యక్షులుగా గుడిపాల వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు గా కాసరపు రవి, జిల్లా సెక్రటరీ గా దార ఓబులేసు, జిల్లా జనరల్ సెక్రటరీ కేడం సుబ్బారావు, సిరివెళ్ల మండల అధ్యక్షులు మారబత్తుల జయపాల్, సిరివెళ్ల మండల అధ్యక్షురాలు కేడం రామాదేవి, సిరివెళ్ల మండల సెక్రటరీ ఎద్దుల అశోక్, సిరివెళ్ల మండల జనరల్ సెక్రటరీ కాసరపు సురేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మేకల లింగస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజకుమారులు మాట్లాడుతూ.. జిల్లా నూతన కమిటీకి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు. నూతన కమిటీ సభ్యులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సిద్ధికి కృషి చేయాలన్నారు, మాలల పై జరుగుతున్న దాడులను, దౌర్జన్యాలను ఎండగట్టాలన్నారు. మాల స్త్రీలపై లైంగిక వేధింపులు, అత్యాచారములను అరికట్టడమే మన సంఘము యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. మాల ప్రజలకు స్వతహాగా ఉన్న భూములను కబ్జా చేసిన వారిని చట్టపరంగా శిక్ష విధింపచేయుటకు కమిటీ పూర్తిస్థాయి మద్దతు ఇస్తుందన్నారు. గ్రామీణ, పట్టణ స్థాయిలో మాల ప్రజలకు స్మశాన ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మాలలకు చెందిన అసైన్డ్ భూములను సత్వరముగా వారికి హక్కును కల్పించడం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. వెట్టి కాపురులకు, బెగరులకు ప్రోత్సాహ వేతనమును ఏర్పాటు చేయడం కోసం కృషి చేస్తామన్నారు. మరి ముఖ్యంగా ప్రతి మండల కేంద్రంలో ఒక అంబేద్కర్ భవనం తో, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఈ మాల మహానాడు రాష్ట్ర కమిటీ కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి పేద మాల ప్రజలకు ఇవ్వవలసిన సబ్సిడీ రుణాలు మంజూరు చేయుటకు కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమం లో మాల మహిళా సేన రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రోజక్క, రాష్ట్ర స్మశాన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తలారి నాగరాజు, దళిత సమతా సైనిక దళ్ జిల్లా అధ్యక్షులు అల్వకొండ ప్రేమ కుమార్, జిల్లా మీడియా కో కన్వీనర్ మేకల వెంకటేశ్వర్లు తదితర మాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్ 2027లో ప్రథమ బహుమతి గెలుచుకుని, రాష్ట్ర స్థాయి పోటీకి అర్హత సాధించిన విద్యార్థిని



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 09 . (నంది పత్రిక): నంద్యాలలోని శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.కె. సానియా, 'వికిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027'లో భాగంగా నిర్వహించిన యూత్ పార్లమెంట్ 2027 పోటీలో ప్రథమ బహుమతి సాధించి సంస్థకు కీర్తిని తెచ్చిపెట్టింది.భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ జిల్లా స్థాయి పోటీ నంద్యాలలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగింది. "ఒకే దేశం, ఒకే ఎన్నిక" అనే ఇతివృత్తంపై దృష్టి సారించిన ఈ పోటీ, యువతకు ముఖ్యమైన జాతీయ సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి మరియు వారి నాయకత్వం, సంభాషణ మరియు ప్రసంగ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఒక అవకాశాన్ని కల్పించింది. 18-25 ఏళ్ల వయస్సు వర్గంలోని పోటీదారులతో తలపడిన ఎస్.కె. సానియా, తన ప్రసంగంతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ విజయంతో, ఆమె రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్ పోటీకి ఎంపికైంది, ఇది ఆమె విద్యా ప్రస్థానంలో మరో ముఖ్యమైన మైలురాయి.ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వి. సుబ్రమణ్యం మరియు సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఫరూఖ్, సానియా సాధించిన ఈ అద్భుతమైన విజయానికి ఆమెను అభినందించి, ఆమె కృషిని, నిబద్ధతను ప్రశంసించారు. నాయకత్వ లక్షణాలు, భావప్రసార నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచనా విధానం మరియు జాతీయ వ్యవహారాలపై అవగాహన వంటి వాటిని పెంపొందించుకోవడానికి విలువైన వేదికలను అందించే ఇటువంటి పోటీలలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని వారు ప్రోత్సహించారు.శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం మరియు అధ్యాపక బృందం విద్యార్థినిని అభినందించి, జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలో ఆమె విజయం సాధించాలని ఆకాంక్షించారు.

జనగణన 2027ను పకడ్బందీగా నిర్వహించాలి





స్వీయ గణనపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి జనగణన వివరాల సేకరణలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

నంది పత్రిక కర్నూలు బ్యూరో : జనగణన2027లో భాగంగా రెండో దశలో నిర్వహించనున్న జనాభా గణన ప్రక్రియను పకడ్బందీగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహనతో శిక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. సోమవారం బృందావన్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా స్థాయి, మున్సిపల్ కార్పొరేషన్ స్థాయి, ఛార్జ్ స్థాయి జనగణన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సంబధిత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జనగణన నిర్వహణపై రెండు రోజుల పాటు అందించే శిక్షణను అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. శిక్షణలో వివరించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా విని, ముఖ్యమైన విషయాలను నోట్ చేసుకోవాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పూర్తయ్యే సమయానికి ప్రతి ఒక్కరికీ జనాభా గణన ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. శిక్షణలో భాగంగా సిబ్బందికి క్విజ్ లేదా పరీక్ష నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించాలని సూచించారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ (స్వీయ గణన) ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. గతంలో స్వీయ గణన చేసుకున్న వారు తమకు జనరేట్ అయిన ఐడీ నంబర్‌ను కుటుంబ సభ్యులకు తెలియజేయకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు, ఉద్యోగులు స్వీయ గణన చేసుకున్న అనంతరం తమ ఐడీ నంబర్‌ను కుటుంబ సభ్యులకు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. తద్వారా ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లినప్పుడు స్వీయ గణన పూర్తయిన విషయాన్ని తెలియజేసి, ఐడీ వివరాలను అందించడం ద్వారా ప్రక్రియ సులభతరం అవుతుందని తెలిపారు. స్వీయ గణన విధానం, దాని ప్రయోజనాలపై ప్రత్యేక పత్రికా ప్రకటనలు విడుదల చేయడంతో పాటు సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జనగణన ప్రక్రియపై ఆర్‌డీఓలు నిరంతర పర్యవేక్షణ చేయాలి

జనగణన కార్యక్రమంలో ఆర్‌డీఓలు కీలక బాధ్యతలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. డివిజన్ల వారీగా ఆర్‌డీఓలు, తహశీల్దార్లు, సీపీఓ, డీఆర్‌ఓ తదితర అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గరిష్ట సంఖ్యలో మండలాలను కవర్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో హౌస్ లిస్టింగ్ ఎన్యూమరేషన్ సమయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సిబ్బంది విషయంలో ఈసారి కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. జనగణనలో సేకరించే వివరాల నాణ్యత అత్యంత ముఖ్యమని, ఎలాంటి తప్పులు లేకుండా ఖచ్చితమైన సమాచారం నమోదు చేయాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే మొత్తం ప్రక్రియను తిరిగి నిర్వహించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. అందువల్ల ప్రారంభం నుంచే ప్రతి అధికారి, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ప్రతి ఎన్యూమరేటర్, సూపర్‌వైజర్ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు వివరాలు అడిగినప్పుడు ముందుగా తమ గుర్తింపు కార్డులను చూపించి, జనగణన ఉద్దేశాన్ని వివరించాలని సూచించారు. ప్రజల ఇళ్లకు వెళ్లినప్పుడు చిరునవ్వుతో, స్నేహపూర్వకంగా మాట్లాడాలని, వారి సహకారాన్ని మర్యాదపూర్వకంగా కోరాలని తెలిపారు. ప్రజలతో దురుసుగా వ్యవహరించకుండా, ఓపికగా వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ప్రజల సహకారం, అధికారుల సానుకూల వైఖరి జనగణన విజయవంతానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

సరైన సమాచారం సేకరించి భద్రతపై ప్రజలకు భరోసా కల్పించాలి

జనాభా గణనలో భాగంగా నిర్దేశించిన ప్రశ్నావళి ప్రకారం కుటుంబ సభ్యులు, విద్యార్హతలు, వివాహ స్థితి తదితర అంశాలకు సంబంధించిన వివరాలను సేకరించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రశ్నల సంఖ్య, వివరాల సేకరణ విధానంపై శిక్షణలో పూర్తి అవగాహన పొందాలని సూచించారు. ప్రజలు తమ వివరాలు అందించేందుకు ఎలాంటి సందేహాలు వ్యక్తం చేసినా జనగణన ఉద్దేశాన్ని స్పష్టంగా వివరించి, అధికారిక మార్గదర్శకాల ప్రకారం సమాచార భద్రతకు సంబంధించిన అంశాలపై వారికి భరోసా కల్పించాలని తెలిపారు. తహశీల్దార్లు, ఎంపీడీఓలు అదనపు ఛార్జ్ అధికారులుగా తమ పరిధిలో జనగణన పనులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశించిన ప్రొఫార్మా ప్రకారం రోజువారీ ప్రగతి నివేదికలను సమర్పించాలని, క్షేత్రస్థాయి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు అందించే శిక్షణను పూర్తిగా నేర్చుకున్న అనంతరం సూపర్‌వైజర్లు తమ పరిధిలోని ఎన్యూమరేటర్లకు అదే స్థాయిలో సమగ్ర శిక్షణ అందించాలని తెలిపారు. నాణ్యతా తనిఖీల సమయంలో సేకరించిన వివరాలు, నిర్వహించిన పనుల నాణ్యతను స్పష్టంగా చూపించగలిగేలా రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. జనగణన2027 అనేది దేశ భవిష్యత్ ప్రణాళికలకు ఎంతో కీలకమైన కార్యక్రమమని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి కర్నూలు జిల్లాలో జనగణన ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, ఆదోని ఆర్డీవో అరుణ దేవి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా సెన్సస్ ఇన్‌చార్జ్ ఎన్. దీపక్ భరద్వాజ్, తహశీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తూరు సుబ్బరాయునికి వెండి పడిగె విరాళం!

స్వామివారికి 900 గ్రాముల వెండి నాగ పడిగె సమర్పణ.

మొక్కుబడి తీర్చుకున్న నంద్యాల భక్తుడు.

పాణ్యం, నంది పత్రిక.నవంబర్ 09. ప్రముఖ శైవక్షేత్రమైన పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానానికి ఓ భక్తుడు భారీ విరాళాన్ని సమర్పించారు. నంద్యాల పట్టణం మెయిన్ బజార్‌కు చెందిన కె.హరినాథ్ కుమారుడు కె.నాగేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఆలయానికి విచ్చేశారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తమ ఇలవేల్పు కావడంతో, తమ మొక్కుబడిలో భాగంగా 900 గ్రాముల బరువు కలిగిన వెండి నాగ పడిగెను స్వామివారికి విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) యం.రామకృష్ణ దాతల కుటుంబానికి ఆలయ సాంప్రదాయాల ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామివారి కృపతో అందరికీ ఆయురారోగ్యాలు కలగాలని ఈఓ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులతో పాటు సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు మరియు భక్తులు పాల్గొన్నారు.



మండల స్థాయి 12వ సీరతున్నబీ -2026 పోటీ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం

పోరుమామిళ్ల నవంబర్ 9 (నంది పత్రిక): కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సీరత్ కమిటీ గత సెప్టెంబర్ నెల లో నిర్వహించిన "సీరతున్నబీ-2026 " 12 వ పోటీలలో ప్రతిభ చూపిన వారందరికి బహుమతుల ప్రధానోత్సవం ఆదివారం జిల్లా పరిషత్ ఉర్దూ, పోరుమామిళ్ల ఆవరణలో నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఖాసీం వల్లి కుమారుడు ముహమ్మద్ మునవ్వర్ మండలంలో ప్రధమస్థానంలో నిలిచి,రెండు వేల రూపాయలు నగదు బహుమతి మరియు ప్రశంసా పత్రం పొందడం జరిగింది. అదేవిధంగా ద్వితీయ స్థానం లో నిలిచిన వారికి పదిహేను వందల రూపాయలు నగదు బహుమతి మరియు ప్రశంసా పత్రం, తృతీయ స్థానం లో నిలిచిన వారికి పన్నెండు వందల రూపాయలు నగదు మరియు ప్రశంసా పత్రం అందించారు. ఈ పోటీలలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి బహుమతి మరియు ప్రశాంసా పత్రాలను కమిటీ సభ్యులు మౌలానా అక్బర్ అలీ సాహెబ్, షేక్ ఇస్ హాక్ అలీ సాహెబ్, మౌలానా మాలిక్, షేక్ మునీర్ గారి చేతుల మీదుగా అందజేయడం జరిగింది.వక్తలు ప్రసంగిస్తూ ప్రవక్త ముహమ్మద్ (స అ సం)గారి ఆదర్శ జీవితం మానవాళికి మార్గదర్శకం, ఆచరణీయం అని, అందరం ముహమ్మద్ ప్రవక్త గారి జీవితం ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రభోదించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల స్థాయిలోని అన్ని పాఠశాలల ముస్లిం విద్యార్థులు, తల్లిదండ్రులు, మదరసా విద్యార్థులు, పుర ప్రముఖులు, ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.





గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ కు అభినందనలు తెలిపిన అభిరుచి మధు.

నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 9 (నంది పత్రిక) గిద్దలూరు మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన ఎన్డీఏ కూటమి పార్టీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ జేవీ నారాయణను భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అభిరుచి మధు అభినందనలు తెలిపారు. నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జేవీ నారాయణ ను స్వయంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా డాక్టర్ అభిరుచి మధు మాట్లాడుతూ.. గిద్దలూరు మున్సిపాలిటీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి చైర్మన్ డాక్టర్ జేవీ నారాయణ విశేషంగా కృషి చేయాలని ఆకాంక్షించారు.



ఎన్డీఏ కూటమి పార్టీ బీజేపీ పక్షాన బరిలో నిలిచి విజయబావుటా ఎగురవేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, రానున్న రోజుల్లో పట్టణ రూపురేఖలు మార్చే దిశగా ఆయన పాలన సాగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక బీజేపీ, కూటమి పక్షాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #D.NO.: 1-639-1-7-11, NEAR NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPARI, ANANTHAPURAMU, ANDHRA PRADESH-515411, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6831. Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

బాణసంచా తయారీ కేంద్రాల్లో అగ్ని ప్రమాదాలు, పేలుళ్ల నివారణకు పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



నంది పత్రిక కర్నూలు బ్యూరో : రాష్ట్రంలో బాణసంచా తయారీ కేంద్రాల్లో అగ్ని ప్రమాదాలు, పేలుళ్లను నివారించి కార్మికుల ప్రాణాలకు, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీ.వో.ఎంఎస్.నం.234, తేదీ 07-11-2026 ద్వారా సమగ్ర భద్రతా మార్గదర్శకాలను జారీ చేసిందని, ఆ మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి పేర్కొన్నారు.బాణసంచా తయారీ కేంద్రాల యజమానులు ప్రభుత్వ భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని, ప్రజల ప్రాణ రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని బాణసంచా తయారీ, నిల్వ మరియు విక్రయ కేంద్రాలపై రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, కార్మిక, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల అధికారులు సమన్వయంతో తనిఖీలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.ప్రతి యూనిట్‌లో కనీసం మూడు నెలలకు ఒకసారి సంయుక్త తనిఖీలు నిర్వహించడంతో పాటు, అధిక ప్రమాదం ఉన్న కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నామని, లైసెన్సులు, అనుమతించిన నిల్వ పరిమాణాలు, తయారీ ప్రక్రియలు, భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక పరికరాలు, కార్మికుల శిక్షణ, బీమా మరియు అత్యవసర భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు.చెల్లుబాటు అయ్యే లైసెన్సులు లేకుండా కార్యకలాపాలు నిర్వహించడం, అనుమతికి మించి పేలుడు పదార్థాలను నిల్వ చేయడం, నిషేధిత రసాయనాలు ఉపయోగించడం,

అనర్హులైన లేదా శిక్షణ పొందని కార్మికులను నియమించడం వంటి తీవ్రమైన ఉల్లంఘనలు గుర్తించినట్లయితే చట్టప్రకారం తక్షణమే కార్యకలాపాలను నిలిపివేసి, లైసెన్స్ సస్పెన్షన్ లేదా రద్దు తదితర కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, తయారీ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, కార్మికులకు తప్పనిసరి భద్రతా శిక్షణ, సంవత్సరానికి కనీసం రెండుసార్లు మాక్ డ్రిల్స్ నిర్వహణ, తనిఖీల వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయడం వంటి చర్యలు అమలు చేయనున్నామన్నారు.ఫైర్‌వర్క్స్ సేఫ్టీ కమిటీ ద్వారా తనిఖీల్లో నిర్లక్ష్యం వహించడం, ఉల్లంఘనలను గుర్తించకపోవడం లేదా వాటిపై చర్యలు తీసుకోకపోవడం వంటి సందర్భాల్లో బాధ్యులైన అధికారులపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు.

ఓటరు జాబితాలో పేరు లేని వారికి మరో అవకాశం...!

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

అర్హులైన వారు నమోదు పత్రాలు సమర్పించి ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవాలి



కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 9: నంది పత్రిక ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా వివిధ కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేరు చేరని అర్హులైన వారికి.. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మరో అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గైర్హాజరు, నివాసం మారడం, మరణం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి కారణాలతో ఓటరు జాబితాలో పేరు చేరని వారి వివరాలను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ, పురపాలక కార్యాలయాల్లో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈ వివరాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచాలని సూచించారు.సంబంధిత ఓటర్లకు బూత్ స్థాయి అధికారులు నమోదు పత్రాలను అందజేస్తారని, అందుబాటులో ఉన్న ఫోన్ నంబర్లకు వాట్సాప్, సందేశాల ద్వారా కూడా పంపిస్తారని తెలిపారు. ఓటర్లు తమ పాత ఓటరు గుర్తింపు సంఖ్యతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లేదా ఈసీఐనెట్ యాప్ ద్వారా కూడా నమోదు పత్రాలను పొందవచ్చని వివరించారు. ఇంతకుముందు నివాసం మారని వారు నమోదు పత్రంతో పాటు, గతంలో ఎందుకు సమర్పించలేకపోయారో తెలియజేస్తూ అనుబంధం-బి ప్రకటనను అందజేయాలి. రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మారిన వారు కొత్త చిరునామా వివరాలతో అనుబంధం-సి ప్రకటనను జతచేసి సమర్పించాలి. వీరు ప్రత్యేకంగా ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. చిరునామా ఆధార పత్రాలు లేని నిరాశ్రయులకు బూత్ స్థాయి అధికారి పరిశీలన నివేదిక ఆధారంగా నివాస ధ్రువీకరణ కల్పిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6 సమర్పించిన వారు మళ్లీ నమోదు పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి, అర్హులైన వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేరుస్తారని తెలిపారు.

గతంలో ఉన్న ఓటరు గుర్తింపు సంఖ్యనే తిరిగి కేటాయిస్తారని వివరించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో పేరు చేర్చుకునే అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా నిరాశ్రయులు, ఇతర కారణాలతో అందుబాటులో లేని ఓటర్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అదే సమయంలో ఒకరి పేరు రెండుసార్లు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియను నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేసి, నవంబర్ 22వ తేదీలోగా నివేదిక పంపాలని అధికారులను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

పదవి ఇచ్చిన ప్రజలకు మరింత బాధ్యతగా సేవ చేద్దాం కూటమి ప్రభుత్వ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేద్దాం“:





ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ .. - దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో కూటమి విజేతల కోలాహలం. - వేలాదిగా తరలివచ్చి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కూటమి శ్రేణులు. - పదవులు అలంకారం కాదు.. ప్రజాసేవకు దక్కిన గొప్ప అవకాశం: పదవులకు వన్నె తీసుకురావాలని ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే చింతమనేని దిశానిర్దేశం.

దెందులూరు బ్యూరో చీఫ్ నవంబర్ 9 నంది పత్రిక: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా దెందులూరు నియోజకవర్గంలో నాలుగు జడ్పీటీసీలకు గాను నాలుగు కూటమి విజయం సాధించగా, మరోవైపు ఎంపీటీసీ స్థానాల్లో సైతం 66 ఎంపీటీసీ స్థానాలు కూటమి అభ్యర్థులు సాధించిన అఖండ విజయంతో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దుగ్గిరాల క్యాంపు కార్యాలయం విజయ శోభతో వెల్లివిరిసింది. నియోజకవర్గవ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కూటమి ముఖ్య నాయకులు, మహిళలు మరియు కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ గెలుపునకు అండగా నిలిచి మార్గనిర్దేశం చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు పుష్పగుచ్ఛాలు అందజేసి, భారీ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గెలుపొందిన ప్రజాప్రతినిధులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ కీలక మార్గదర్శనం చేశారు. రాజకీయాల్లో పదవులనేవి కేవలం అలంకారప్రాయం కాదని, ప్రజలకు మరింత చేరువై సేవ చేసేందుకు దక్కిన అద్భుతమైన అవకాశాలని స్పష్టం చేశారు. నాయకులుగా ఎదిగేందుకు లభించిన ఈ బాధ్యతను సద్వినియోగం చేసుకుంటూ, ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా పనిచేసి ప్రజాప్రతినిధి పదవులకే వన్నె తీసుకురావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటంలో క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు.నియోజకవర్గంలో కూటమి గెలుపునకు పగలు, రాత్రి శ్రమించిన నాయకులు, కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదని, ప్రతి ఒక్కరి సమష్టి కృషితోనే ఈ ప్రభంజనం సాధ్యమైందని కొనియాడారు. కూటమి ప్రభుత్వానికి మద్దతుగా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి ఘనవిజయాన్ని అందించిన దెందులూరు నియోజకవర్గ ఓటర్లకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గారపాటి రామసీత, తెలుగుదేశం పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్, దెందులూరు జడ్పిటిసి పెనుబోయిన మహేష్ యాదవ్, పెదపాడు జడ్పిటిసి మరియు బిజెపి జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, ఏలూరు రూరల్ జెడ్పిటిసి ఘంటసాల శ్రీనివాస్, చల్లచింతలపూడి ఎంపీటీసీ తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని, పెదపాడు ఎంపీటీసీ గుత్తా అనిల్, మండల పార్టీల అధ్యక్షులు ఈడుపుగంటి అనిల్, నాగనబోయిన సత్యనారాయణ, మరడాని రవి, నేతల రవి, సహా పలువురు ఎంపీటీసీలు, వారి కుటుంబ సభ్యులు, మండల పార్టీల కార్యదర్శులు, క్లస్టర్ ఇంచార్జిలు, టిడిపి బిజెపి జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..





రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో 100% ఉత్తీర్ణత సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్స్





నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 9 (నంది పత్రిక) నంద్యాల శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఈరోజు 9(గూ) బెటాలియన్, కర్నూలు నుండి ముగ్గురు ఆర్మీ అధికారులు హవల్దార్ పి.శ్రీనివాస రావు హవల్దార్.యస్.యం.రఫీ , హవల్దార్. గోపి కృష్ణ విచ్చేసి ఎన్‌సీసీ బి సర్టిఫికెట్ సాధించిన క్యాడెట్లకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కళాశాలలో మొత్తం 58 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు బి సర్టిఫికెట్ పరీక్షకు హాజరు కాగా, అందరూ కూడా ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఉత్తీర్ణులైన క్యాడెట్లకు అధికారులు బి సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావం అలవడతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఎన్‌సీసీలో కూడా రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి , ప్రిన్సిపాల్ కె.వి.బి. సుబ్బయ్య , ఎన్‌సీసీ అధికారి ఎం. శివరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన క్యాడెట్లను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.



శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న నంద్యాల 2 టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి!

ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికిన ఈఓ యం.రామకృష్ణ. ఆశీర్వచన మంటపంలో వేద పండితుల ఆశీర్వాదం.



పాణ్యం, నవంబర్ 09 (నంది పత్రిక): ప్రముఖ శైవక్షేత్రమైన పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానాన్ని నంద్యాల 2 టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన సీఐ సుధాకర్ రెడ్డికి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) యం.రామకృష్ణ. ప్రధాన అర్చకులు కంపమల్ల నారాయణ శర్మ మరియు అధికార సిబ్బంది ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఐ ఆలయంలో శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయన పేరిట అర్చనలు, అభిషేకములు, విశేష పూజలు జరిపించారు. దర్శనానంతరం ఆలయంలోని ఆశీర్వ మంటపము నందు సీఐ సుధాకర్ రెడ్డికి వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈఓ మరియు సిబ్బంది ఆయనను శేష వస్త్రములతో, పూలమాలలతో ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను, చిత్రపటమును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

తొలగించిన ఓటర్లపై ఇంటింటి సర్వే నిర్వహించాలి...

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 9 నంది పత్రిక ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సీ యు రివిజన్ (ఎస్ ఐ ఆర్), 2026లో భాగంగా నిర్వహించిన గణన దశలో బూత్ స్థాయి అధికారులు 2026 జూన్ 15 నుంచి జూలై 24 వరకు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ పరిశీలనలో మరణించిన ఓటర్లు, శాశ్వత నివాస మార్పు, ఒక వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదు ఉండటం, ఇతర కారణాలతో జిల్లాలో మొత్తం 85,444 మంది ఓటర్లు దిద్దుబాట్లలో అందుబాటులో లేని గుర్తింపులు జరిగినట్లు తెలిపారు. డి ఎల్ వో లు ఇంటింటి పరిశీలన అనంతరం, 2026 జూలై 31న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో జిల్లాలో మొత్తం 13,89,592 మంది ఓటర్లుగా నమోదు ఉన్నారని పేర్కొన్నారు.ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో, తుది ఓటర్ల జాబితాలో చేర్చవలసిన మరో 4,406 మంది ఓటర్లను అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ వివరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని నవంబర్ 30, 2026న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హత కలిగిన ప్రతి ఒక్క వ్యక్తి ఓటరుగా నమోదు కాకుండా మిగిలిపోకుండా ఉద్దేశ్యంతో తొలగించిన ఓటర్లపై మరొకసారి ఇంటింటి పరిశీలన నిర్వహించడంతో పాటు, ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన వ్యక్తులను గుర్తించి ఓటరుగా నమోదు చేయడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.బూత్ స్థాయి అధికారులు ఓటరు జాబితాలో తొలగించబడిన ప్రతి ఒక్కరి వివరాలను పరిశీలించి, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాన్ని గుర్తించి, వారి నుంచి ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు కోసం దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. నిరంతర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా వారికి ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా నిరంతర సవరణ ప్రక్రియను ప్రతి సంవత్సరం జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1 మరియు అక్టోబర్ 1 తేదీలను అర్హత తేదీలుగా పరిగణిస్తూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తుది ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు తమ అర్హతకు సంబంధించిన పత్రాలతో ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ విజేతలతో ఎమ్మెల్యే రాము భేటీ... ప్రజా వేదికలో కూటమి విజేతల ఆత్మీయ సమావేశం





3కి 3 జడ్పీటీసీలు.. 32కి 28 ఎంపీటీసీలు

కైవసం.. గుడివాడలో కూటమి సునామీ

నందివాడలో చరిత్ర సృష్టించాం...తొలిసారి

జడ్పీటీసీ, ఎంపీపీ మనదే:ఎమ్మెల్యే రాము

గుడ్లవల్లేరులో 2024 కంటే ఎక్కువ ఓట్లు - 70 శాతం పైగా కూటమికే జై కొట్టిన ఓటర్లు...

ఈ విజయం కూటమి ప్రభుత్వానికి మనం ఇస్తున్న బహుమతి:ఎమ్మెల్యే రాము

పని చేసేవాడికే ప్రజలు పట్టం కడతారు... ఫలితాల్లో ఇదే రుజువైంది

ఓడిన 4 స్థానాల బాధ్యత నాదే బాధ్యతగా తీసుకుంటా...

జిల్లాలోనే నెం.1 రిజల్ట్ గుడివాడదే...మున్సిపల్ రిజల్ట్ కూడా ముందే తేలిపోయింది

ఇప్పుడు వచ్చిన ఫలితాలను మించి...మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తాం

నాయకుడు అంటే పారిపోకూడదు...ముందుండి నడిపించాలి..నమ్ముకున్న వారినే మోసం చేశారు

దమ్ము అంటే పిచ్చి ఛాలెంజ్ లు చెయ్యడం కాదు.. ప్రజల కోసం పని చేయడం పదవి అలంకారం

కాదు.....గెలిచిన అందరూ బాధ్యతగా పనిచేయండి

గుడివాడ బ్యూరో చీఫ్ నవంబర్ 9: నంది పత్రిక

గుడివాడ నియోజకవర్గంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజా ప్రతినిధులతో గుడివాడ ప్రజా వేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం భేటీ అయ్యారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాలకు చెందిన జడ్పీటీసీలు అంగడాల భారతి, దుడ్ల ప్రదీప్ కుమార్, వర్రె బలరామకృష్ణ, ఎంపీటీసీలు, కూటమి నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విజేతలను ఎమ్మెల్యే రాము ఆలింగనం చేసుకుని అభినందించారు. మహిళా ప్రజా ప్రతినిధులకు నమస్కరిస్తూ అభివాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ 3 జడ్పీటీసీలకు మూడు, 32 ఎంపీటీసీలకు 28 స్థానాల్లో ఘన విజయం సాధించామన్నారు. నందివాడలో 44 ఏళ్ల టీడీపీ చరిత్రలో తొలిసారి జడ్పీటీసీ, ఎంపీపీ గెలవడం చారిత్రాత్మకమని చెప్పారు. గుడ్లవల్లేరులో 2024 కంటే ఎక్కువ శాతంతో గెలిచామని, చాలా గ్రామాల్లో 69-71% ఓట్లు కూటమికే వచ్చాయని తెలిపారు. ప్రజల కోసం పని చేస్తున్నామని, అందుకే ప్రజలు మాకు అండగా నిలిచారని అన్నారు. ఈ విజయాన్ని కూటమి ప్రభుత్వానికి బహుమతిగా ఇస్తున్నామని పేర్కొన్నారు.పని చేస్తేనే ప్రజలు మెప్పుతారని నమ్ముతానని, అదే ఈ ఫలితాల్లో రుజువైందని స్పష్టం చేశారు. ఓడిన నాలుగు స్థానాల బాధ్యత తానే తీసుకుంటున్నానని అన్నారు. జిల్లాలోనే ఉత్తమ ఫలితాలు గుడివాడలో వచ్చాయని, దీంతో మున్సిపల్ ఫలితాలు ముందే తెలిసిపోయాయని చెప్పారు. రానున్న గుడివాడ మున్సిపల్ ఎన్నికల్లో దీనికి మించిన మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.నాయకుడంటే ముందుండి నడిపించాలని, పారిపోకూడదని ఎద్దేవా చేశారు. నమ్ముకున్న సొంత వారిని సైతం మోసం చేశారని విమర్శించారు.

దమ్ము అంటే ప్రజల కోసం పని చేయడమే తప్ప , ఓడిపోతే బూట్లు తుడుస్తా, అని పిచ్చి ఛాలెంజ్ లు చేయడం కాదని అన్నారు. పదవి అలంకారం కాదు, బాధ్యత అని, నూతనంగా గెలుపొందిన అందరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు.అనంతరం జడ్పీటీసీలు వర్రె బలరామకృష్ణ, అంగడాల భారతి, దుడ్ల ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ తమను గెలిపించిన ప్రజలకు, కూటమి శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే రాము నాయకత్వంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ జనసేన అభ్యర్థులను గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో పని చేసి విజయం సాధిస్తామని పేర్కొన్నారు.చివరగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ప్రజలిచ్చిన ఈ తీర్పుతో బాధ్యత మరింత పెరిగిందని, కార్యకర్తల కష్టానికి, ప్రజల నమ్మకానికి అభివృద్ధితో రుణం తీర్చుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు వాసే మురళి, దానేటి సన్యాసిరావు, పోలవరపు వెంకట్రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, జనసేన నేత సందు పవన్, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.





నందమూరు గ్రామంలో రేషన్ పంపిణీ కేంద్రం, వరద బాధిత గృహాలను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ



భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 9 నంది పత్రిక తాడేపల్లిగూడెం మండలం నందమూరు గ్రామంలో జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ పర్యటించి, రేషన్ పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణంలో నిల్వలు, లబ్ధిదారులకు రేషన్ పంపిణీ జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో వరదల కారణంగా నీట మునిగిన ఇళ్లను పరిశీలించి, బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.



ఉద్యోగి 48 గంటలు కస్టడీలో ఉంటే సస్పెన్షన్ అయినట్లే: సుప్రీంకోర్టు

ప్రభుత్వ ఉద్యోగుల సస్పెన్షన్‌కు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏదైనా కేసులో అరెస్టయిన ప్రభుత్వ ఉద్యోగి 48 గంటలకు మించి జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే, సదరు ఉద్యోగి ఆటోమేటిక్‌గా సస్పెన్షన్‌లో ఉన్నట్లే (డీమ్డ్ సస్పెన్షన్) పరిగణించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇందుకు ప్రత్యేకంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది.

బిహార్‌లోని సమస్తీపూర్ సదర్ ఆసుపత్రి మేనేజర్ విశ్వజీత్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఒక కాంట్రాక్టర్‌కు సంబంధించిన రూ. 36,421 వేతన బకాయిలను క్లియర్ చేసేందుకు రూ. 4,000 లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఆయన అవినీతి నిరోధక చట్టం కింద అరెస్టయ్యారు. అరెస్టు అనంతరం ఆయన దాదాపు 15 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ కేసులో సెషన్స్ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేయగా, పాట్నా హైకోర్టు ఆ ఉత్తర్వులను రద్దు చేసింది.

శ్రీశైలం దేవస్థానంలోనవంబరు 10 నుంచి కార్తికమాసోత్సవాలు









శ్రీశైలం నవంబర్ 09(నంది పత్రిక) నవంబరు 10 నుంచి డిసెంబరు 9 వరకు కార్తీకమాసోత్సవాలు కార్తీకమాసమంతా భక్తులరద్దీ కారణంగా గర్భాలయ అభిషేకాలు, సామూహిక అర్జిత అభిషేకాలు పూర్తిగా నిలుపుదల పంచమతాలలో అర్జిత అభిషేకాలకు రూ. 216/- రుసుముతో అవకాశం నవంబరు 20 కార్తీక శుద్ధ ఏకాదశిరోజున దేవస్థాన ఆగమ పాఠశాల ఎదురుగా కోటి దీపోత్సవం కార్తీకమాసంలోని సోమవారాలలో లక్షదీపోత్సవం పుష్కరిణి హారతి కార్తీక పౌర్ణమి రోజున జ్వాలాతోరణం, లక్షదీపోత్సవం పుష్కరిణి హారతి, నవంబరు 13న పాతాళగంగ వద్ద కృష్ణమ్మహారతి శని,ఆది,సోమవారాలు మరియు పర్వదినాలలో శ్రీస్వామివారి స్పర్శదర్శనం నిలుపుదల సాధారణ రోజులలో నిర్దిష్టవేళలో అయిదు విడతలుగా స్వామివారి స్పర్శదర్శనానికి అవకాశం నవంబరు 10 నుండి డిసెంబరు 9 వతేదీ వరకు కార్తీకమాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు మరియు కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్తీకమాసోత్సవాల నిర్వహణకు వివిధ ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. భక్తులకు వసతి, మంచినీటి సరఫరా, సౌకర్యవంతమైన దర్శనం, ఆలయ వేళలు, శ్రీస్వామిఅమ్మ వార్ల అర్జితసేవలు, క్యూలైన్ల నిర్వహణ, రద్దీక్రమబద్ధీకరణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, కార్తీకసోమవారాలు, అదేవిధంగా కార్తీకమాసంలో ప్రతీసోమవారం మరియు కార్తీకపౌర్ణమి రోజున జరిగే పుష్కరిణి హారతి, లక్షదీపోత్సవం, నవంబరు 13వ తేదీన జరిగే కృష్ణమ్మహారతి, నవంబరు 20న జరిగే కోటి దీపోత్సవం, నవంబరు 24న కార్తీకపౌర్ణమినాడు జ్వాలాతోరణోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్తీకమాసంలో ఆకాశదీపం ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ మొదలైన కార్యక్రమాలకు సంబంధించి పలు ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు.

సిబ్బందికి ప్రత్యేక విధులు : భక్తులకు సేవలు అందించేందుకుగాను కార్తీకమాసంలో రద్దీరోజులందు కార్యాలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించబడ్డాయన్నారు.

దర్శనం ఏర్పాట్లు : ప్రతీరోజూ వేకువజామున 3గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ప్రాత:కాలసేవలను జరిపించిన అనంతరం వేకువజామున గం. 4.30ల నుంచి సాయంత్రం గం. 4.00ల వరకు దర్శనాలను కొనసాగుతాయన్నారు. అదేవిధంగా తిరిగి సాయంత్రం గం. 5.30ల నుంచి దర్శనాలు కొనసాగుతాయన్నారు. శని,ఆది,సోమవారాలు మరియు ఇతర పర్వదినాలలో శ్రీస్వామివారి స్పర్శదర్శనం పూర్తిగా నిలుపుదల చేయడం జరిగిందన్నారు.

సాధారణ రోజులలో విడతలవారీగా స్పర్శదర్శనం :

శని,ఆది,సోమవారాలు కాకుండా తక్కిన సాధారణ రోజులలో రోజుకు 5 విడతలుగా శ్రీస్వామివారి స్పర్శదర్శనానికి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. సర్వదర్శనం క్యూలైన్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్దిష్టవేళల్లో విడతలవారీగానే ఈ స్పర్శదర్శనం కల్పించడం జరుగుతుందన్నారు.

ఆర్జితసేవలు : గత సంవత్సరం వలెనే సాధారణ భక్తుల సౌకర్యార్థం కార్తీకమాసమంతా కూడా గర్భాలయ అభిషేకాలను మరియు సామూహిక అభిషేకాలను పూర్తిగా నిలుపుదల చేయడం జరిగిందన్నారు. సామాన్య భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీలుగా కార్తీకమాసంలో శని,ఆది,సోమవారాలు మరియు పర్వదినాలలో (16 రోజులపాటు) అమ్మవారి అంతరాలయంలో నిర్వహించు కుంకుమార్చనలు (రూ.1000/-రుసుము) ఆశీర్వచన మండపంలో నిర్వహించబడుతాయన్నారు. రుద్రహోమం, చండీహోమం, సాక్షిగణపతి హోమం, నిత్యకల్యాణం మొదలైన ఆర్జిత సేవలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

పంచమతాలలో ఆర్జిత అభిషేకాలు : శ్రీశైలమహాక్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగా భక్తులు పరమేశ్వరునికి అభిషేకాలను జరిపించుకునేందుకు వీలుగా పంచమతాలలో ఆర్జిత అభిషేకాన్ని ఈ సంవత్సరము ప్రత్యేకంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు భక్తులు కేవలం రూ. 216/-లను మాత్రమే రుసుముగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఒక టికెట్ పై దంపతులు లేదా ఒకరిని అభిషేకానికి అనుమతించడం జరుగుతుందన్నారు. ఈ ఆర్జిత అభిషేక టికెట్లను మనమిత్ర వాట్సాప్ నెంబరు 9552300009 మరియు ఏ.పి.టి.ఎస్ వారి వెబ్‌సైట్ ఎఫఎష్.ఎం.ఘజూ.స్త్రశీఱ.అఅ ద్వారా పొందవచ్చునని అన్నారు. అభిషేకానికి అవసరమైన పూజాసామాగ్రిని దేవస్థానం సమకూరుస్తుందన్నారు. భక్తులు వారి అభీష్టం మేరకు పంచమతాలుగా ప్రసిద్ధమైన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలోని ఏదైనా ఒకమఠంలో ఈ ఆర్జిత అభిషేకాన్ని జరిపించుకోవచ్చునని అన్నారు.

అన్నప్రసాదాల వితరణ :

భక్తులకు అన్న ప్రసాదవితరణ భవనములో ఉదయం గం.10.45ల నుండి అన్నప్రసాదాల వితరణ చేయబడుతుందన్నారు. సాయంత్రం గం. 7.00ల నుంచి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయబడుతుందన్నారు క్యూకాంప్లెక్స్‌లో దర్శనానికి వేచి ఉండే భక్తులకు మంచి నీరు,బిస్కెట్లు, అల్పాహారం అందజేయబడుతాయన్నారు. అదేవిధంగా రద్దీ అధికంగా ఉన్న రోజులలో ఉదయం వేళలో వేడిపాలు అందజేయబడుతాయన్నారు.

లడ్డు ప్రసాదాలు : కార్తీకమాసంలో వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సంఖ్యలో లడ్డు ప్రసాదాలు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. కార్తీకమాసమంతా కూడా అదనపు ప్రసాద విక్రయ కౌంటర్లు ఏర్పాటు చేయబడుతాయి. అదనంగా 6 కౌంటర్లను ఏర్పాటు చేసి మొత్తం 14 కౌంటర్ల ద్వారా ప్రసాదాలు అందజేయబడుతాయన్నారు.

పాతాళగంగవద్ద ఏర్పాట్లు కార్తీకమాసములో భక్తులు పుణ్యస్నానాలకు ప్రాధాన్యత ఇస్తున్న కారణంగా పాతాళగంగ వద్ద పుణ్యస్నానాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. పాతాళగంగవద్ద శౌచాలయాల నిర్వహణ, పారిశుద్ధ్యం నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా అదనపు లైటింగ్ ఏర్పాట్లు కూడా చేయబడ్డాయన్నారు. భద్రతాచర్యలలో భాగంగా పాతాళగంగ వద్ద ఈతనిపుణులను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

కేశఖండనశాలలో ఏర్పాట్లు

భక్తులు తలనీలాలు సమర్పించుకునేందుకు కేశఖండనశాలలో ఆయా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా భక్తులరద్దీకనుగుణంగా కేశఖండనశాల వేళలను నిర్ధారించడం కూడా జరిగిందన్నారు.

సూచిక బోర్డుల ఏర్పాట్లు : భక్తులు సమాచారం తెలుసుకునేందుకు వీలుగా అవసరమైన అన్ని ప్రదేశాలలో తగిననీ సూచికబోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

కార్తీకమాసం సందర్భంగా శివచతుస్సప్తాహ భజనలు : లోకకల్యాణం కొరకు కార్తికమాసంలో అఖండ శివభజనలు నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

కార్తీకదీపారాధన భక్తులు కార్తీకదీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తర మాడవీధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. . అదేవిధంగా ఆలయముందుభాగంలోని గంగాధరమండపం వద్ద కూడా దీపారాధనకు తగిన ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు.

కృష్ణమ్మహారతి : నవంబరు 13వ తేదీన పాతాళగంగ వద్ద జరిగే కృష్ణమ్మహారతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కోటి దీపోత్సవం - జ్వాలాతోరణోత్సవం : నవంబరు 20, కార్తీక శుద్ధ ఏకాదశిరోజున దేవస్థాన ఆగమపాఠశాల ఎదురుగా గల మైదానములో కోటి దీపోత్సవం మరియు నవంబరు 24న గంగాధరమండపం వద్ద కార్తీకపౌర్ణమినాడు జ్వాలాతోరణోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం మరియు పుష్కరిణి హారతి

కార్తీకసోమవారాలు మరియు పౌర్ణమిరోజున ఎప్పటి వలనే ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం మరియు పుష్కరిణి హారతి కార్యక్రమాలు నిర్వహించబడుతాయన్నారు. **సాంస్కృతిక కార్యక్రమాలు** ఆలయ నిత్యకళావేదిక వద్ద ప్రతిరోజు ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడుతాయన్నారు. లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి రోజులలో పుష్కరిణి వద్ద ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతాయన్నారు.



స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ ఘన సన్మానం

ప్రత్యర్థి పార్టీలకు ఏమాత్రం జంకకుండా ఎన్నికలను ధీటుగా ఎదుర్కొన్న మా అభ్యర్థులకు అభినందనలు

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్వకేట్ బోయ క్రాంతి నాయుడు



కర్నూల్ సిటీ నంది పత్రిక స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీచేసిన అభ్యర్థులు ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు ఏమాత్రం భయపడకుండా ఎన్నికలను ధీటుగా ఎదుర్కొన్న మా అభ్యర్థులందరికీ పేరుపేరునా జిల్లా కాంగ్రెస్ కమిటీ తరపున అభినందనలు తెలియజేస్తున్నానని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది బోయ క్రాంతి నాయుడు తెలియజేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సూచన మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున కార్పొరేషన్ మేయర్, మున్సిపల్ చైర్మన్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జడ్పిటిసి, ఎంపిటిసి సభ్యులుగా ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందుకు వచ్చి పోటీ చేసిన వారందరినీ పేరుపేరునా గౌరవించి చేతులు జోడించి నమస్కరిస్తు, అభినందిస్తున్నాం అని అడ్వకేట్ క్రాంతి నాయుడు తెలియజేశారు. అలాగే పార్టీకి అన్ని విధాలుగా అండగా నిలిచిన వారందరినీ, మేము గౌరవిస్తూ అభినందిస్తున్నామని ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులకు ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు దీటుగా ఆర్థికంగా సహకరించ లేకపోయినప్పటికీ ఏమాత్రం వెనుకడుగు వేయకుండా దృఢ సంకల్పంతో నిలబడిన వారందరినీ అభినందిస్తున్నామని తెలియజేశారు. ఎటువంటి ఆర్థిక సాయం అందకపోయినా ప్రత్యర్థి పార్టీలకు దీటుగా పార్టీకి అండగా నిలిచి ఎన్నికల్లో పోటీ చేసిన వారికి కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నానని, నేను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చానని నాకు రాజకీయ నేపథ్యం లేదని, నేను కేంద్ర ప్రభుత్వ సర్వీస్ కు రాజీనామా చేసి రాజకీయాలలోనికి వచ్చానని 2019 ఎన్నికలలో పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశానని, అయినప్పటికీ మేము చాలా ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీతోనే ఉంటూ పార్టీ కోసం పని చేశామని, ఎన్నికలకు ముందు మేము కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి యువత, మేధావులు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయాలని వార్తాపత్రికల్లో ప్రకటనలు కూడా ఇచ్చామని, రౌండ్ టేబుల్ సమావేశాలతో కాంగ్రెస్ వైపు మేధావులు చూసారని, కొంతమంది కొత్త వ్యక్తులు పార్టీలోకి వచ్చారని దశలవారీగా మా ఉనికిని బలోపేతం చేసుకుంటూ ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని ఆశించామని కానీ కొన్ని సమస్యల వల్ల అది సాధ్యపడలేదని, ఇక ముందు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున అన్ని విధాలుగా పోరాడుతం అని రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యే వరకు కృషి చేస్తాం అని తెలియజేశారు. సమావేశం అనంతరం పోటీ చేసిన అభ్యర్థులందరినీ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ కర్నూలు జిల్లా ఇన్చార్జి తెలుగు విజయ్ కుమార్, గోనెగండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముల్లా కాసిం వలి, మహిళా కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షురాలు పి సుజాత రెడ్డి, ఓబీసీ జిల్లా మహిళా నాయకురాలు భాగ్యలక్ష్మి, జడ్పిటిసి అభ్యర్థులు రామచిలుకల యువరాజు, ముళ్ల ఒసామా, జయపాల్, గొరైల శ్రీనివాసులు అలెన్ కుమార్ నాగేష్, కాంగ్రెస్ నాయకులు విజయ భాస్కర్ కార్పొరేటర్, కౌన్సిలర్ ఎంపిటిసి అభ్యర్థులు నిషార్ అహ్మద్, ప్రభాకర్ నాయుడు, బాలన్న జే వి శిరీష మొదలగువారు పాల్గొన్నారు.

దీపావళి జ్ఞాన జ్యోతి ప్రతి ఇంట్లో వెలగాలి

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం.



బేతంచెర్ల నవంబర్ 9 (నందిపత్రిక). దీపావళి పండుగ ను పురస్కరించుకుని,త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక చింతలపల్లి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం నాడు నంద్యాల జిల్లా, బేతం చర్ల మండలం లోని ఎంబోయి,,రుద్రవరం గ్రామాలలో ఇంటింటా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు దీపావళి గురించి మాట్లాడుతూ లి"గురువు తన జ్ఞానాగ్ని తో శిష్యుల తలలో జ్ఞాన జ్యోతి వెలిగించి, యోగ మార్గంలో నడిపిస్తాడు అనుటకు గుర్తుగా, దీపావళి రోజున ఇంట్లో దీపాలు వెలిగించాలని, అలాగే శరీరం బయట అంతటా విశ్వాన్ని నడిపే పరమాత్మ శక్తి ఉంది అనేందుకు గుర్తింపుగా, ఇంటి బయట కూడా దీపావళి రోజు దీపాలు వెలిగించాలని తెలిపారు..జ్ఞానదీపం తలలో వెలిగించిన గురువే మోక్ష దీపం తో మోక్షం నకు చేరుస్తాడు అని గ్రహించాలి.ఈ కార్యక్రమం లో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- చింతలపల్లి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పి.పుల్లారెడ్డి సంజీవ,పార్థసారథి,చక్రపాణి, వెంకటరవణమ్మ,నాగమద్దిలేటి, నాగలక్షమ్మ,కృష్ణవేణి, వెంకటేశ్వరమ్మ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రెండు జెడ్పీటీసీ, 40 ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకున్నాం

ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి



ఎమ్మిగనూరు నవంబర్ 9 (నంది పత్రిక) స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు చారిత్రాత్మక విజయాన్ని అందించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించిన నేపథ్యంలో, గెలుపొందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో కలసి ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి గారు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రెండు జెడ్పీటీసీ స్థానాలతో పాటు 40 ఎంపీటీసీ స్థానాలను చారిత్రాత్మక మెజారిటీలతో కైవసం చేసుకోవడమే కాకుండా, ఎంపీపీ స్థానాలను కూడా కూటమి కైవసం చేసుకుందని తెలిపారు.గత మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు అందించిన విజయాన్ని గ్రామీణ ప్రాంతాల్లో కూడా పునరావృతం చేస్తూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు తమ మద్దతును ఓట్ల రూపంలో తెలియజేశారని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి లభించిన మెజారిటీకి సమానంగా ప్రస్తుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూడా ప్రజలు ఆదరణ చూపించడం ఎంతో సంతోషకరమని అన్నారు.

గత 3040 సంవత్సరాలుగా ఎమ్మిగనూరు మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగే పరిస్థితులు ఉన్నప్పటికీ, ఈసారి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి, ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుని తమ నిర్ణయాన్ని స్పష్టంగా వెల్లడించారని తెలిపారు.ఈ విజయం కేవలం ప్రారంభం మాత్రమేనని, రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనే కాకుండా 2029 సాధారణ ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులు అఖండ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థులకు అండగా నిలిచి, విజయానికి కృషి చేసిన కూటమి పార్టీల నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజయం సాధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, ఏఎంసీ చైర్మన్ కురుమల్లయ్య మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

బనగానపల్లె చివరి నవాబుకు ఘన నివాళి



బనగానపల్లె నవంబర్ 9నందిపత్రిక బనగానపల్లె చిట్ట చివరి నవాబు అయిన జనాబ్ నవాబ్ మీర్ ఫజల్ అలీ ఖాన్ జయంతి సందర్భంగా బనగానపల్లె పట్టణ షియా మతస్తులు సోమవారం బనగానపల్లె లోని నవాబు విగ్రహాగానికి పూలమాల ఘనంగా నివాళి అర్పించారు ఈ సందర్భంగా వారు నవాబు ఘనతను కొనియాడారు. నవాబు 1922 నుండి 1948 వరకు బనగానపల్లె ప్రాంతాన్ని పరిపాలించారు. ఇప్పటివరకు ప్రజా సేవలో నవాబు ఆస్తులు సేవ చేస్తున్నాయని తెలిపారు.బనగానపల్లెకు గొప్ప పేరు ఈయన వల్ల ఉంది కాబట్టి మనమందరం స్మరించుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈయన కాలంలోనే బనగానపల్లె బాగా అభివృద్ధి జరిగింది భారతదేశంలో అప్పటి బనగాలపల్లె రాష్ట్రాన్ని విలీనం చేయడంలో జవహర్లాల్ నెహ్రూ హోమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సారథ్యంలో నవాబు భారత దేశంలో విలీనం చేశారు ప్రస్తుతం బనగానపల్లెలో ఉన్నటువంటి ప్రభుత్వ కార్యకలాపాలు జరుగుతున్న పాఠశాలలు ప్రభుత్వ ఆసుపత్రి. ప్రభుత్వ పశువుల ఆసుపత్రి. కోర్టు. తహసీల్దార్ కార్యాలయం . పాత పోలీస్ స్టేషన్. మొదలగు ఆస్తులను కూడా నవాబు ప్రభుత్వానికి అప్పజెప్పారు ఇప్పటివరకు ప్రజా సేవలో ఈ ఆస్తులు పనిచేస్తూనే సేవ చేస్తున్నాయి బనగానపల్లెకు గొప్ప పేరు ఈయన వల్ల ఉంది కాబట్టి మనమందరం ఈయన జయంతి జరపడం మన ధర్మం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె పట్టణ ప్రజలు నవాబు అభిమాను లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతొ నరసింహ స్వామి స్వాతి వేడుకలు



బనగానపల్లెనవంబర్ 9నందిపత్రిక బనగానపల్లె మండలం, రవలకొండ మీద వెలసిన, శ్రీ శ్రీ శ్రీ చెంచులక్ష్మి సమేత పావన నరసింహ స్వామి ఆలయం నందు స్వాతి వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారని, దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, ధర్మకర్త, నిర్మాణకర్త, విశ్వహిందూ పరిషత్ ప్రచారకులు మరియు ప్రధాన అర్చకులు అయినటువంటి బాలిశెట్టి పావన నరసింహమూర్తి తెలిపారు. ఆదివారం ఉదయం మంగళ వాయిద్యాలతో, సుప్రభాతం సేవతో, తులసీదళాలతో అర్చనలు, అభిషేకాలు మరియు ప్రత్యేక పూజలు జరిగాయని అర్చకులు తెలియజేశారు. మధ్యాహ్నము నుంచి ట్రస్ట్ బోర్డు మీటింగ్ జరిగిందని ఆయన తెలిపారు. ఈ మీటింగ్ లో కళ్యాణమండపము మరియు ప్రహరీ నిర్మాణం చర్చించడం జరిగింది. కావున అందరూ ఆమోదించి మినిట్స్ బుక్ లో రాసుకోవడం జరిగింది. కాబట్టి ఈ యొక్క పనిని తొందరగా మొదలు పెట్టడం జరుగుతుందని, ఆయన తెలియజేశారు. ట్రస్ట్ లో దేవస్థానం వారసురాలు శ్వేత మరియు ట్రస్ట్ సెక్రటరీ రవణమ్మ ఉన్నారు. ఇంకా మిగతా ట్రస్ట్ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి, స్వామివారి ఆశీస్సులు పొందారని ఆయన తెలియజేశారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణలు స్వాతి రోజున స్వామి వారికి ఆకు పూజ, 108 నిమ్మకాయలతో దండ తులసీదండ మొదలగు అలంకరణ చేయడం జరిగింది అని ఆయన తెలిపారు. అర్చకులు వారి అమ్మకి కూడా పూజ చేయడం జరిగింది . మిగతా నవ నరసింహులు నవగ్రహాలు, పుట్టుసిల, స్వయంభు శివలింగము, కృష్ణుడు మరియు నాగులకు కూడా ప్రత్యేక పూజలు చేయడం జరిగిందని , ఆయన తెలియజేశారు.


క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేసిన తెలుగు బ్లాక్ హాక్స్ ఏజెన్సీ ప్రిన్సిపాల్ చైర్మన్ అభిషేక్ రెడ్డి కి కృతజ్ఞతలు : గంజి రాజశేఖర్



నంది పత్రిక ఆత్మకూరు శ్రీశైలం నియోజకవర్గశీ ఆత్మకూరు పట్టణంలోని నారాయణ విద్యావిహార్ పాఠశాల క్రీడాకారులకు వాలీబాల్ మరియు టీ షర్టులు అందజేసిన తెలుగు బ్లాక్ హాక్స్ ఏజెన్సీ చైర్మన్ అభిషేక్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు నారాయణ విద్యా విహార్ కరస్పాండెంట్ గంజి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ వారికి ధన్యవాదాలు తెలిపారు. క్రీడాకారులకు దాతలు ప్రోత్సహిస్తే వారు భవిష్యత్తులో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శిస్తారని తెలిపారు.ఇలాగే బ్లాక్ హాక్స్ సంస్థ చైర్మన్ అభిషేక్ రెడ్డి తమ ఏజెన్సీ ద్వారా రాష్ట్రం లో అన్ని పాఠశాల మరియు కళాశాలల్లో వాలీబాల్ క్రీడాకారులకు క్రీడా కిట్లు పంపిణీ చేయవలసినదిగా ఆత్మకూరు క్రీడాకారుల తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. స్పోర్ట్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు రేడియం నూర్ మాట్లాడుతూ రాష్ట్రం లో ఈ విధంగా క్రీడాకారులకు క్రీడా కిట్లు అందించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఇటీవలే ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ తరపున చైర్మన్ పస్పిల్ మున్నా మరియు సెక్రెటరీ రైల్వే కృష్ణ కు విజయవాడ సిద్ధార్థ కళాశాల లో జరుగుతున తెలుగు బ్లాక్ హాక్స్ ఏజెన్సీ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రైమ్ వాలీబాల్ సీజన్ -5 క్రీడలకు ఆహ్వానం అందిందని,ఆత్మకూరు చరిత్రలో క్రీడాకారుల్లో ఎవరికి ఇలాంటి అవకాశం రాలేదని తెలిపారు. ఆత్మకూరు క్రీడాకారుల పై ప్రతేక దృష్టి పెట్టిన తెలుగు బ్లాక్ హాక్స్ సంస్థ క్యాంప్ టెక్నికల్ ఆఫీసర్ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు తులసి రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈకార్యక్రమంలో పాఠశాల సిబ్బంది జబీఉల్లా మరియు క్రీడాకారులు పాల్గొన్నారు



చైర్మన్ గా గెలిచిన డి.దస్తగిరికి అభినందనలు తెలిపిన దూదేకుల సంఘం నాయకులు.



బేతంచెర్ల నవంబర్ 9 (నంది పత్రిక). బేతంచెర్ల నగర పంచాయితీ ఎన్నికలలో వైఎస్ ఆర్ సిపి చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసి 1509 ఓట్ల మెజారిటీ తో గెలిచిన దూదేకుల ధస్తగిరిని, దూదేకుల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు వాసవి దస్తగిరి ఆధ్వర్యంలో డి. దస్త గిరిని ఘనంగా సోమవారం సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో దూదేకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి, ట్రెజరర్ హుసేనప్ప సీనియర్ నాయకులు షేక్షావలి చిన్న మాబుహేసేన్, హుసేన్, పట్టణ అధ్యక్షులు కంకర షేక్షావలి,సంఘం యూత్ అధ్యక్షులు గబ్బర్, ప్రధాన కార్యదర్శి దహిద్ హుసేన్ పాల్గొన్నారు.

స్కౌట్స్‌లో జిల్లా విద్యార్థికి రాజ్యపురస్కారం..!

అభినందించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 9 నంది పత్రిక: స్కౌట్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో రాజ్యపురస్కారం అందుకున్న కడప జిల్లా విద్యార్థి ఎం. నరసింహుడును జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అభినందించారు.విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ గౌరవ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రాజ్యపురస్కార ధ్రువపత్రం అందుకున్న చెన్నూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్ విద్యార్థి ఎం. నరసింహుడు, ఆయనకు మార్గనిర్దేశం చేసిన స్కౌట్ మాస్టర్ వెంకటసుబ్బయ్య సోమవారం జిల్లా కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా విద్యార్థి నరసింహులు, స్కౌట్ మాస్టర్ వెంకటసుబ్బయ్యను కలెక్టర్ అభినందించారు. చిన్న వయసులోనే క్రమశిక్షణ, సేవాభావం, పట్టుదలతో స్కౌట్స్‌లో ప్రతిభ చూపి రాజ్యపురస్కారం అందుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. విద్యార్థి సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, చదువుతో పాటు సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవర్చుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థి విజయానికి తోడ్పడిన స్కౌట్ మాస్టర్‌ను కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పాల్గొన్నారు.



ఐ ఐ ఐ టీ డి ఎం కర్నూలులో డాక్టరేట్ సాధించిన జి. పుల్లయ్య అధ్యాపకురాలు ఫాజియా సుల్తానా

కర్నూలు సిటీ నందిపత్రిక స్థానిక జి.పుల్లయ్య కళాశాల అధ్యాపకురాలు ఎస్.ఫౌజియా సుల్తానా ఐఐఐటిడిఎం కర్నూలులో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో పిహెచ్డి పూర్తి చేసి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఆమె పరిశోధనకు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కరంతోట్ కృష్ణ నాయక్ మార్గదర్శకత్వం వహించారు. ఆమె థీసిస్ శీర్షిక వెహిక్యులర్ అడ్ హాక్ నెట్వర్క్లలో నమ్మకమైన కమ్యూనికేషన్ మరియు క్యూఓఎస్ ఆప్టిమైజేషన్ కోసం ఒక ఫ్రేమ్వర్క్. ఈ పరిశోధన సమాజానికి ఎంతో ఉపయోగపడుతుంది. వాహనాల మధ్య వేగవంతమైన సురక్షిత సమాచార మార్పిడి వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. అంబులెన్స్ ఫైర్ ఇంజన్ వంటి అత్యవసర వాహనాలకు దారి సులభమవుతుంది. ట్రాఫిక్ రద్దీ తగ్గి సమయం ఇంధనం ఆదా అవుతాయి. కాలుష్యం తగ్గి స్మార్ట్ సిటీల అభివృద్ధికి దోహదపడుతుంది. ప్రయాణికుల భద్రత పెరిగి డ్రైవర్లకు ముందస్తు హెచ్చరికలు అందుతాయి. రోడ్లపై సమాచార ప్రసారం మరింత నమ్మకంగా వేగంగా జరుగుతుంది. ఈ సందర్భంగా జి.పుల్లయ్య కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు,విద్యార్థులు మరియు ఐఐఐటిడిఎం అధ్యాపకులు ఆమెను హృదయపూర్వకంగా అభినందించారు. ఆమె కృషి పట్టుదల అంకితభావం యువ పరిశోధకులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.



అంబిలి కాశీ విశ్వనాథ్ విజయం ఏబీవీపీ కుటుంబానికి గర్వకారణం!

కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు నగరంలో ఘనంగా ఏబీవీపీ పూర్వ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంఏబీవీపీ పూర్వ కార్యకర్తల ఐక్యతకు, ఆత్మీయ అనుబంధాలకు, సంఘటనా స్ఫూర్తికి ప్రతీకగా కర్నూలులో నిర్వహించిన ఏబీవీపీ పూర్వ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం అత్యంత ఘనంగా విజయవంతమైంది. కర్నూలు నగర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 18వ వార్డు కార్పొరేటర్‌గా ఘనవిజయం సాధించిన ఏబీవీపీ పూర్వ కార్యకర్త, ప్రముఖ న్యాయవాది అంబిలి కాశీ విశ్వనాథ్ ని అభినందిస్తూ ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. ఏబీవీపీ అనేది కేవలం విద్యార్థి సంఘం మాత్రమే కాదని, దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావాన్ని పెంపొందించే గొప్ప వ్యక్తిత్వ నిర్మాణ వేదిక అని కొనియాడారు. ఏబీవీపీలో పనిచేసిన కార్యకర్తలు సమాజంలో ఎక్కడ ఉన్నా తమ విలువలను కాపాడుకుంటూ ప్రజాసేవలో ముందుండాలని అన్నారు. అంబిలి కాశీ విశ్వనాథ్ విద్యార్థి దశలో ఏబీవీపీలో పనిచేసి, నేడు ప్రజల మద్దతుతో కార్పొరేటర్‌గా విజయం సాధించడం అభినందనీయమని, ఈ విజయం ఏబీవీపీ కుటుంబానికే గర్వకారణమని ప్రశంసించారు.ఏబీవీపీ పూర్వ కార్యకర్త వేణుగోపాల్ మాట్లాడుతూ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, కార్యకర్తల మధ్య ఉన్న అనుబంధం, ఐక్యత ఎప్పటికీ కొనసాగాలని ఆకాంక్షించారు.ఏబీవీపీ రాష్ట్ర సంఘటన మంత్రి నలిశెట్టి సుమన్ మాట్లాడుతూ ఏబీవీపీ కార్యకర్తలు కేవలం పదవుల కోసం పనిచేసేవారు కాదని, సిద్ధాంతం కోసం, దేశం కోసం నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలని పేర్కొన్నారు. కాశీ విశ్వనాథ్ విజయం కార్యకర్తలందరికీ స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఏబీవీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు నాగఫణి శాస్త్రి మాట్లాడుతూ ఏబీవీపీ కార్యకర్తల నిజాయితీ, క్రమశిక్షణ, పోరాట పటిమ, త్యాగనిరతి వారిని సమాజంలో ప్రత్యేకంగా నిలబెడతాయని పేర్కొన్నారు. విద్యార్థి దశలో ఏర్పడిన అనుబంధం జీవితాంతం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో



గిరిరాజ వర్మ , గోపాలకృష్ణయ్య , దరేశ్ గౌడ్ , మద్దిలేటి యాదవ్ , ఏవీ సుబ్బారెడ్డి , ప్రేమ్ కుమార్ , లవన్ కుమార్ రెడ్డి , బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డి ,బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కేశవ్ రామ్ చౌదరి సీనియర్ బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ రంగస్వామి , ప్రముఖ న్యాయవాది బి. మోహన్ కృష్ణ నాయుడు వాల్మీకి , సాయి ప్రదీప్ , నేషనలిస్ట్ గణేష్, భరత్ జేబీకే, సూర్య, మహేంద్ర, మహేష్, రవి, రాజు పండు, యుగంధర్ గౌడ్, స్వామి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు పూర్వ కార్యకర్తలు అంబిలి కాశీ విశ్వనాథ్ తో తమకున్న అనుబంధాన్ని, విద్యార్థి దశలో కలిసి పనిచేసిన అనుభవాలను, పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. కాశీ విశ్వనాథ్ మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఏబీవీపీ కుటుంబ సభ్యులకు ఏ ఆపద వచ్చినా, అర్ధరాత్రి అయినా అండగా నిలబడతామని పలువురు పెద్దలు భరోసా ఇచ్చారు.ఈ సమ్మేళనంలో జ్యేష్ఠ కార్యకర్తలు, పూర్వ కార్యకర్తలు, ప్రస్తుత ఏబీవీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు.ఒక కార్యకర్త విజయం అంటే ఒక వ్యక్తి విజయం మాత్రమే కాదు.. అతడిని తీర్చిదిద్దిన సంస్థకు, అతనితో కలిసి నడిచిన కార్యకర్తలందరికీ గర్వకారణం. అంబిలి కాశీ విశ్వనాథ్ కార్పొరేటర్ విజయం, ఏబీవీపీ పూర్వ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం రెండూ కర్నూలు ఏబీవీపీ కుటుంబంలో నూతన ఉత్సాహాన్ని నింపాయి అని అన్నారు.

దోపిడి దొంగ కోసం గాలింపు చేపట్టిన కర్నూల్ తాలూకా పోలీస్ లు

కర్నూలు తాలూకా సిఐ తేజ మూర్తి

కర్నూల్ సిటీ నంది పత్రిక 11.04.2011 తేదీన తెల్లవారుజామున 02:00 గంటల నుండి 03:00 గంటల మధ్య, మామిడాలపాడు పంచాయతీ పరిధిలోని కమలాపార బాయిల్డ్ రైస్ మిల్ వద్ద దోపిడీ సంఘటన జరిగింది. ఫిర్యాదుదారుడైన ఎల్లూరు నాగరత్నమయ్య, వయస్సు 50 సంవత్సరాలు, తండ్రి ఎల్లూరు రామయ్య గారి నివాస గృహంతో కూడిన రైస్ మిల్ ప్రాంగణంలోకి వెనుక గేటు ద్వారా ఎనిమిది మంది గుర్తుతెలియని దుండగులు ప్రవేశించారు. ఆ సమయంలో ధాన్యం లోడుతో మిల్లుకు వచ్చిన రెండు లారీలకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్లు మరియు మిల్లు వాచ్‌మన్‌ను కత్తులతో బెదిరించారు. అనంతరం దుండగులలో ఒకరి లుంగీని ముక్కలుగా చించి, వాటితో వారి చేతులు, కాళ్ళను కట్టివేశారు. వారిలో ఇద్దరు దుండగులు అక్కడే ఉండి వారిపై నిఘా ఉంచారు. మిగిలిన ఆరుగురు దుండగులు మెట్ల మార్గం ద్వారా భవనంలోని టెర్రస్‌పైకి వెళ్ళి, అక్కడి నుంచి మరో మెట్ల మార్గం ద్వారా ఫిర్యాదుదారుని ఇంటి హాలులోకి దిగారు. ఆ సమయంలో ఫిర్యాదుదారుడు, ఆయన భార్య నాగమణి, మరదళ్ళు శ్రీదేవి, వీరమణి మరియు పనిమనిషి వెంకమ్మ హాలులో నిద్రిస్తున్నారు. దుండగులు వారిని కత్తులతో బెదిరించి, వారి వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను మరియు మూడు సెల్‌ఫోన్లను దోచుకున్నారు. అనంతరం ఇంటి హాలులో ఉన్న ఇనుప బీరువాను బయటకు తీసుకువచ్చి, ఇంటిలోని వారిని లోపలే ఉంచి హాలుకు తాళం వేశారు. ఆ బీరువాను మిల్లు వెనుక గేటు ద్వారా ప్రాంగణం వెలుపలికి తీసుకెళ్ళి, ఇనుప రాడ్లతో పగులగొట్టి, అందులో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, రూ.30,000/- నగదు మరియు ఆరు పట్టు చీరలను దోచుకుని వెళ్ళిపోయారు.ఈ సంఘటనలో మొత్తం 43 తులాల బంగారు ఆభరణాలు, 2 కిలోల వెండి ఆభరణాలు, రూ.30,000/- నగదు, మూడు సెల్‌ఫోన్లు మరియు ఆరు పట్టు చీరలు దోపిడీకి గురయ్యాయి. దోపిడీకి గురైన సొత్తు మొత్తం విలువ సుమారు రూ.7,55,000/- గా అంచనా వేయబడింది. ఈ విషయమై అదే రోజు ఉదయం 09:30 గంటలకు అందిన ఫిర్యాదు మేరకు కర్నూలు తాలూకా అర్బన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ .నెంబర్ .94/2011 యు /యస్ 395 ఐపీసీ గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడమైనది.దర్యాప్తులో ఈ కేసులోని ఆరుగురు ముద్దాయిలను అరెస్టు చేసి, సొత్తు రికవరీ చేయడమైనది. వారిపై కోర్టులో కేసు కొట్టివేయబడింది. అయితే ఏడవ ముద్దాయి అయిన పండు ఏ పాలశివ, వడ్లమూడి గ్రామం, గుంటూరు జిల్లా, కోర్టుకు హాజరు కానందున అతనిపై కేసు పి ఆర్ సి నెంబర్ .130/2011 గా పెండింగ్‌లో ఉన్నది. అతని నివాస స్థలంలో వెతికినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు.

పరారీలో ఉన్న ముద్దాయి వివరాలు:

పేరు

పండు ఏ పాలశివ

స్వగ్రామం

వడ్లమూడి గ్రామం, గుంటూరు జిల్లా

కోర్టు కేసు నెం.

పి ఆర్ సి చీశే.130/2011 పై ముద్దాయి ఆచూకీ తెలిసిన వారు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కర్నూలు తాలూకా అర్బన్ పోలీస్ స్టేషన్, సెల్ నెం. 9121101063 కు తెలియజేయగలరు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడును.

42వ వార్డ్,శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా అమావాస్య వే డుకలు

దాసరి మోహన్,ఆలయకమిటీ అధ్యక్షు లు



నంది పత్రిక కర్నూలు ప్రతినిది కర్నూలు నగరం,42వ వార్డ్,ముజఫర్ న గర్,శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ఆల యంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దాస రి మోహన్,కమిటీ బృందం వడ్డె ఆంజనే యులు,వి.విజయ్ కుమార్,వి.నరసింహు లు,టి.రామనాగిరెడ్డి,వడ్డె కృష్ణ,వడ్డె చం ద్ర,భజన భక్త బృందం ఆధ్వర్యంలో సోమ వారం ఘనంగా అ మావాస్య వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పూజారి శేషాచారి ప్రత్యేక పూజల అనం తరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షులు దాసరి మోహ న్ మాట్లాడుతూ అమావాస్య సందర్భం గా అన్నదానం కార్యక్రమానికి దాతల స హకారం అభినందనీయం అన్నారు.ఈ నేపథ్యంలో వారికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.అదే విదంగా ఆలయంలో గత కొన్ని సంవత్సరాలుగా దాతల సహ కారంతో ప్రతి నెల అమావాస్య,ప్రతి సంవ త్సరం శ్రీరామనవమి,హనుమాన్ జయం తి,వార్షికోత్సవం వంటి కార్యక్రమాలు ని ర్వహించడం జరుగుతుందని అన్నారు. కావున పూజ కార్యక్రమాల్లో ప్రజలు,భక్తు లు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చే యాలనీ పిలుపునిచ్చారు.అలాగే సాయం త్రం భజన భక్త బృందంతో భజన కార్యక్ర మం జరిపించారు.ఈ కార్యక్రమంలో భజ న బృందం నాయకులు శేఖర్,41,42వ వార్డ్ ప్రజలు,భజన భక్త బృందం,భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



అన్నదానానికి భక్తులు విరాళం



మహానంది నవంబర్ 09 (నంది పత్రిక):- మహానంది క్షేత్రంలో కొనసాగుతున్న నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందజేశారు.పల్నాడు జిల్లా నూజివీడు మండలం పాత చెరువుకు చెందిన ఇస్కా శ్యామ్ సుందర్ రెడ్డి ,అంజలి దంపతులు రూ.10,116/- భక్తితో విరాళంగా అందజేశారు. దాతలను ఆలయ పర్యవేక్షకులు సుబ్బారెడ్డి అభినందించి, అన్నదాన బాండు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

మహానంది క్షేత్రంలో వైభవంగా పల్లకి సేవ

మహానంది నవంబర్ 09 (నంది పత్రిక):- మహానంది క్షేత్రంలో వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు.సోమవారం సందర్భంగా ఆలయ ఈవో శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు,అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.ముందుగా శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పల్లకిలో ఆశీనులు గావించి,విశేష పూజలు చేపట్టారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



టిడిపి సీనియర్ నాయకులు భార్గవ రామ్ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిని కలిసిన ఎంపీటీసీ జెడ్పీటీసీలు





ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 9 నంది పత్రిక నియోజకవర్గంలోని స్థానిక సంస్థలో విజయం సాధించిన ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులు సోమవారం నాడు ఆళ్లగడ్డ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆళ్లగడ్డ టిడిపి సీనియర్ నాయకులు భార్గవ రామ్ టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సన్మానించి వారికి కృతజ్ఞతలు తెలిపారు. తమను కలిసిన ఎంపీటీసీ జడ్పిటిసి సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు కార్యకర్తలు భూమా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



కడప మేయర్ కు ఐడెంటిటీ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్‌లో ఘన సన్మానం



కడప నవంబర్ 8 (నంది పత్రికరిపోర్టర్)కడప నగరంలోనిఐడెంటిటీ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. మధుసూదన్ రెడ్డి, ఎం.డి.ఎస్.కి, వారి సతీమణి కడప నగర మేయర్ శ్రీమతి మల్లి సువర్ణ కి ఆదివారం హాస్పిటల్ సిబ్బంది ఘనంగా సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బంది ఇరువురికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ, డాక్టర్ ఎన్. మధుసూదన్ రెడ్డి గారు వైద్యరంగంలో అందిస్తున్న సేవలు, హాస్పిటల్ అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. అలాగే కడప నగర మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీమతి మల్లి సువర్ణ నగర అభివృద్ధికి, ప్రజాసేవకు అంకితభావంతో కృషి చేస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఒకవైపు వైద్యసేవల ద్వారా ప్రజలకు సేవలందిస్తూ, మరోవైపు ప్రజాప్రతినిధిగా నగర అభివృద్ధికి కృషి చేస్తున్న ఈ దంపతులు అందరికీ ఆదర్శంగా నిలవాలని సిబ్బంది పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐడెంటిటీ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ వైద్యులు, మేనేజ్‌మెంట్ సభ్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామపురం గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యం

మహానంది, నవంబర్ 09 (నంది పత్రిక):- మహానంది మండలం సీతారామపురం గ్రామానికి చెందిన కంచి లక్ష్మీ ప్రసన్న (36) అనే వివాహిత అదృష్టమైనట్లు మహానంది ఎస్ఐ శివాంజల్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కంభం ప్రాంతంలో తన భర్త రామాంజనేయులుతో కలిసి నివసిస్తున్న లక్ష్మీ ప్రసన్న, గత నెల రోజుల క్రితం సీతారామపురం గ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటోంది.ఈ క్రమంలో 9వ తేదీ సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటిలో ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చి, సీతారామపురంలో ఆటో ఎక్కి వెళ్లిపోయిందన్నారు. ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు స్టేషన్లో కంప్లీట్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ మహిళ ఆచూకీ తెలిసిన వారు వెంటనే మహానంది ఎస్సై సెల్ నంబర్ 9121101093 కు గానీ, లేదా కుటుంబ సభ్యుల నంబర్ 98852 55726 కు గానీ సమాచారం అందించాలని పోలీసులు మరియు కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



మహానంది క్షేత్రంలో కార్తీక శోభ ..

ఆకాశదీపంతో ఘనంగా ఉత్సవాలకు శ్రీకారం...

కార్తీక మాసంలో దీపారాధన, దాన ధర్మాలతో సకల శుభాలు :

వేదపండితులు రవిశంకర్ అవధాని







మహానంది, నవంబర్ 9 (నంది పత్రిక):- పవిత్ర కార్తీక మాసంలో ఆలయాల్లో ఏర్పాటు చేసే ఆకాశదీపాన్ని దర్శించుకోవడం వల్ల భక్తులకు సకల శుభాలు కలుగుతాయని మహానంది దేవస్థానం వేద పండితులు రవిశంకర్ అవధాని పేర్కొన్నారు. కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం మహానంది క్షేత్రంలో ఆకాశదీప ప్రజ్వలన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆకాశదీపాన్ని వెలిగించి,ఆలయ **ధ్వజస్తంభం పైన శాస్త్రోక్తంగా ఆకాశదీపాన్ని ఏర్పాటు చేశారు.** ఈ సందర్భంగా వేద పండితులు రవిశంకర్ అవధాని మాట్లాడుతూ, కార్తీక మాసంలో దీపారాధన, దానధర్మాలకు విశేష ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. శివ కేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసంలో కార్తీక స్నానం, దీపారాధన,దానధర్మాలు,ఆచరించే నోములు, వ్రతాలకు విశేష ఫలితం ఉంటుందన్నారు.ఈ మాసంలో భక్తిశ్రద్ధలతో దీపాన్ని వెలిగించినా, ఆకాశదీపాన్ని దర్శించిన, అర్పాలకు దానాలు చేసినా అనంతమైన పుణ్యఫలం లభిస్తుందన్నారు. నెల రోజులపాటు మహానంది క్షేత్రంలో ఆకాశదీపాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్తీక మాసంలో స్వయంభుగా వెలిసిన శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని భక్తులు విశేష ఫలితం పొందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నీలకంఠేశ్వర రాజు,దేవస్థానం అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ స్థానాల్లోనూ కూటమి క్లీన్ స్వీప్ చేస్తుంది!

కార్పొరేషన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయదుందుభి

పార్టీల ఐక్యత, నాయకుల సమన్వయమే విజయానికి ప్రధాన కారణం

డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్



కర్నూలు సిటీ నందిపత్రిక ఆంధ్రప్రదేశ్ లో రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు అన్ని స్థానాల్లో విజయం సాధించేలా సమష్టిగా కృషి చేస్తామని డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్, టీడీపీ రాష్ట్ర నాయకుడు వై. నాగేశ్వరరావు యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేషన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించడం పార్టీల ఐక్యతకు, నాయకుల సమన్వయానికి నిదర్శనమని పేర్కొన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని తన కార్యాలయంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలిచి తమ ఆదరణను చాటుకున్నారని తెలిపారు. వైసీపీ పాలనలోని విధానాలపై ప్రజలు తమ తీర్పు ద్వారా స్పందించారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీలు బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజుతో పాటు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సమష్టిగా పనిచేయడం అభినందనీయమన్నారు. నాయకుల మధ్య సమన్వయం ఎన్నికల నిర్వహణలోనూ ప్రతిఫలించిందని పేర్కొన్నారు.రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ ఇదే ఐక్యతను కొనసాగించి కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల విజయానికి శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వై. నాగేశ్వరరావు యాదవ్ స్పష్టం చేశారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:- APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి



ఎన్నికల విధులు, నిబంధనలపై అధికారులు ముందస్తు అవగాహన కలిగి ఉండాలి.

మూడు విడతల్లో 393 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు.

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 9 నంది పత్రిక పశ్చిమ గోదావరి జిల్లాలో గ్రామ పంచాయతీల రెండవ సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, అధికారులకు తెలిపారు.సోమవారం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీల రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, డి ఆర్ ఓ పి. గ్లోరీ, ఆర్డీవోలు కె.ఆర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఎం సూర్యారావు,డిపిఓ పి. విజయ భాస్కర్, రిటర్నింగ్ అధికారులు, సంబంధిత ఎన్నికల అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గత సాధారణ ఎన్నికలను జిల్లాలో అధికారులు సమన్వయంతో ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను కూడా ఎలాంటి పొరపాట్లకు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని ముందుగానే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసుకోవాలని, విధుల కేటాయింపు నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన తప్పనిసరి.

ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎన్నికల నియమ నిబంధనలు, మార్గదర్శకాలను ముందుగానే క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఏదైనా సమస్య తలెత్తినప్పుడు నిబంధనల పుస్తకాలు తిరగేసి చూసే పరిస్థితి ఉండకూడదని, ప్రతి అంశంపై ముందస్తు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎదురయ్యే వివిధ సమస్యలు, సందేహాలు, నిబంధనలకు సంబంధించిన అంశాలపై అధికారులు ముందుగానే స్పష్టత తెచ్చుకోవాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

మూడు విడతల్లో 393 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు

జిల్లాలో మొత్తం 393 గ్రామ పంచాయతీల పరిధిలోని 4,382 పోలింగ్ స్టేషన్లలో, 4,206 వార్డులకు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు మూడు విడతలుగా నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందని అన్నారు. మొదటి విడత నోటిఫికేషన్ నవంబర్ 13వ తేదీ, రెండవ విడత నవంబర్ 16వ తేదీ, మూడవ విడత నవంబర్ 19వ తేదీ విడుదల కానున్నట్లు తెలిపారు.మూడు విడతలుగా నామినేషన్ దాఖలు చేయడం జరుగుతుందని అన్నారు. మొదటి విడత నవంబర్, 15వ తేదీ, రెండవ విడత నవంబర్ 18 వ తేదీ, మూడవ విడత నవంబర్ 21వ తేదీన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చని తెలిపారు.

పోలింగ్ అండ్ కౌంటింగ్ ఎన్నికల షెడ్యూల్ వివరాలు:

మొదటి విడత: నవంబర్ 26, 2026.

రెండవ విడత: నవంబర్ 29, 2026.

మూడవ విడత: డిసెంబర్ 02, 2026.

పోలింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుందని, పోలింగ్ ముగిసిన అనంతరం నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బంది సమీకరణపై ప్రత్యేక దృష్టి.

ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. జిల్లాలో 10,42,937 మంది ఓటర్లుగా నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 20 మండలాలకు గాను, 4206 వార్డులలో మొదటి విడతగా 1548, రెండో విడతలో 1568, మూడవ విడతలో 1266, మొత్తం 4382 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మొదటి విడత ఎన్నికలకు సుమారు 5,038 మంది, రెండవ విడత ఎన్నికలకు సుమారు 5,056

మూడవ విడత ఎన్నికలకు సుమారు 4036

మొత్తం మూడు విడుదలకు గాను సుమారు 14,130 మంది సిబ్బంది అవసరం ఉంటుందని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి సిబ్బంది వివరాలను ముందుగానే సేకరించి, అవసరమైన మేరకు విధులను కేటాయించాలని సూచించారు. గతంలో ఎన్నికల విధుల నుంచి మినహాయింపు పొందిన సిబ్బంది కూడా ఈసారి విధిగా ఎన్నికల విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

సర్పంచ్ పదవికి పోటీ చేయు రిజర్వేషన్ అభ్యర్థులు రూ. 3000/-, నాన్ రిజర్వేషన్ అభ్యర్థులు రూ. 1500/- ముందుగా డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.

వార్డ్ మెంబర్ గా పోటీ చేయు రిజర్వేషన్ అభ్యర్థులు రూ. 1,000/-, నాన్ రిజర్వేషన్ అభ్యర్థులు రూ. 500/- డిపాజిట్ చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. రిజర్వేషన్ అభ్యర్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని తెలిపారు.

లిసమన్వయంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు బాధ్యత వహించాలి

డివిజనల్ స్థాయి అధికారులు, సంబంధిత ఎన్నికల అధికారులు, ఇతర శాఖల అధికారులు నిరంతరం పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్డీవోలు, పోలీసు డివిజన్లలోని ఎస్‌హెచ్‌వోలు తమ పరిధిలో ఎన్నికల నిర్వహణను అత్యంత అప్రమత్తంగా పర్యవేక్షించాలని తెలిపారు.

ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది విధుల నిర్వహణ, ఎన్నికల సామగ్రి పంపిణీ, రవాణా, పోలింగ్ అనంతరం కౌంటింగ్ ఏర్పాట్లు వంటి అన్ని అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియలో ప్రతి అధికారి తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, డి ఆర్ ఓ పి. గ్లోరీ, ఆర్డీవోలు కె.ఆర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఎం సూర్యారావు, డిపిఓ పి. విజయ భాస్కర్, రిటర్నింగ్ అధికారులు, సంబంధిత ఎన్నికల అధికారులు, డిపిఓ, డివిజనల్ పంచాయతీ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వరద ముంపు ప్రాంతాల ప్రజలకు తక్షణ సహాయం అందించాలి

అధికారులను ఆదేశించిన

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 9 నంది పత్రిక ఆర్నాబ్, మురుసు తుఫాన్, ప్రభావం భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో ముంపునకు గురైన ప్రాంతాల నిరాశలైన ప్రజలకు తక్షణ సహాయం అందించేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా ఎర్ర కాలువ నుంచి వచ్చిన వరద నీటితో జిల్లా లో, నందమూరు, యనమదుర్రు డ్రైన్ వరద ముంపుకు గురైన గ్రామాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రభుత్వం తరఫున అందించాల్సిన సహాయాన్ని నిచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.వరద నీటిలో మునిగిన ఇళ్ల వివరాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా సేకరించి, నష్టపోయిన పేద కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సహాయం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, డిఆర్ఓ పి .గ్లోరియా, ఆర్డీవోలు కె.ఆర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఎం సూర్యారావు, జిల్లాలోని అందరు తాహసిల్దారు లు పాల్గొన్నారు.



పార్టీ గీత దాటితే వేటు తప్పదు

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

పార్టీ నిర్ణయమే శిరోధార్యం

ధిక్కరిస్తే చర్యలు ఖాయం

నేతలకు తంగిరాల సౌమ్య హెచ్చరిక



నందిగామ బ్యూరో చీఫ్ నవంబర్ 9 నంది పత్రిక పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పరిటాల, పెద్దాపురం, తుర్లపాడు, జుజ్జూరు గ్రామాల్లో కొందరు నేతలు పార్టీ నియమావళికి విరుద్ధంగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ఇప్పటికే పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్లిందని తెలిపారు. పార్టీ నిర్ణయాలను ధిక్కరించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని, భవిష్యత్తులో ఇలాంటి వైఖరిని సహించబోమని హెచ్చరించారు.

ఎన్నికల ఫలితాలు ప్రజలు కూటమితోనే ఉన్నారని నిరూపించాయి

అవనిగడ్డ బ్యూరో చీఫ్ నవత 9 నంది పత్రిక జడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు ప్రజలు కూటమితోనే ఉన్నారని నిరూపించాయని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం సాయంత్రం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కోడూరు మండల జనసేన పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలతో కూటమి ప్రభుత్వంపై ప్రజల విశ్వాసానికి నిదర్శనంగా నిలిచాయన్నారు. ముఖ్యంగా కూటమి కలిసి ఉంటేనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని ప్రజలు గుర్తించారని, కాబట్టే కూటమి అభ్యర్థులకు ఘన విజయాలు చేకూర్చారన్నారు. పవన్ కళ్యాణ్ దూరదృష్టితో బిజెపిని కూడా కూటమిలో భాగస్వామ్యం చేయడంతోనే కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు రాష్ట్రానికి వస్తున్నాయని, తద్వారా గ్రామాల్లో జరిగిన అభివృద్ధితో కూటమి అభ్యర్థులకు ప్రజల నుంచి సంపూర్ణ మద్ధతు లభించిందన్నారు. ఈ ఫలితాల్లో జనసేన అభ్యర్థులు అత్యధిక మెజారిటీలు సాధించటం జనసేన పట్ల, అధినేత పవన్ కళ్యాణ్ పట్ల ప్రజల్లో ఉన్న అభిమానానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. కోడూరు మండలంలో కీలకమైన ఔట్ ఫాల్ స్లూయిజుల పునర్నిర్మాణానికి నిధులు సాధించటం సంతృప్తినిచ్చిన అంశం అన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితంగా నియోజకవర్గంలో దీనావస్థలో ఉన్న గ్రామీణ ప్రాంతాలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కేంద్రం నుంచి సాధించి తెచ్చిన నిధులతో అభివృద్ధి పథంలో నడిపించటంతో ప్రజలు కూటమి అభ్యర్థులను సంపూర్ణ ఆధిక్యంతో గెలిపించారని తెలిపారు. జనసేన పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థుల ఎంపికలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల వారికి మొదటి ప్రాముఖ్యత ఇచ్చి వారిని గెలిపించినట్లు తెలిపారు. తద్వారా జనసేన పార్టీ పక్షాన బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించినట్లు తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాల ద్వారా మరోసారి బడుగు బలహీన వర్గాల ప్రజలందరూ జనసేన పార్టీ వెంట ఉన్నారని నిరూపితం అయిందన్నారు. ఈ ఫలితాల ద్వారా కూటమి ప్రభుత్వంపై ప్రజలకు వ్యతిరేకత లేదని మరోసారి నిరూపితమైందన్నారు. ఇదే ఐక్యతతో కూటమి పొత్తు ధర్మం ప్రకారం గ్రామ పంచాయతీలు కూడా నూరు శాతం కూటమి కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో కోడూరు మండల నాయకులు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేశారన్నారు. పొత్తు ధర్మాన్ని పాటిస్తూ మూడు పార్టీల నాయకులు కలిసికట్టుగా కృషి చేశారన్నారు. జనసేన పార్టీ అభ్యర్థులు 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించటం విశేషం అన్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వారికి పార్టీ నిర్ణయం ప్రకారం ఈ ఎన్నికల్లో అవకాశం కల్పించామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో పని చేసి ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించారన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కూడా ఇదే ఐక్యతతో ముందుకు సాగి అన్ని గ్రామ పంచాయతీలు కూటమి కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కోడూరు మండలంలో జనసేన పార్టీ తరపున ఎంపీటీసీలుగా గెలిచిన రెడ్రౌతు కృష్ణబాబు, దాసరి యేసుకుమారి, దేవనబోయిన బసవయ్య, కొండవీటి సునీత, కొప్పనాతి వెంకటేశ్వరరావు, కనగాల వెంకటేశ్వరరావు, గాదే కృష్ణబాబులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కోడూరు మండల అధ్యక్షులు మర్రె గంగయ్య, టౌన్ అధ్యక్షులు కోట రాంబాబు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం.

ఇప్పటివరకు సుమారు 10 టీఎంసీల వరద నీరు సముద్రంలోకి విడుదల.

రానున్న రెండు రోజుల్లో మిగిలిన గ్రామాల్లోనూ వరద నీరు తగ్గే అవకాశం.

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 9 నంది పత్రిక పశ్చిమగోదావరి జిల్లాలో నవంబర్ 4, 2026 నుంచి యనమదుర్రు డ్రైన్ వ్యవస్థలో అపూర్వమైన వరద పరిస్థితులు ఏర్పడ్డాయని, ఎర్రకాలువతో పాటు బిన్నేరు, పులివాగు మరియు ఇతర స్థానిక వాగుల నుంచి భారీగా వరద నీరు చేరడంతో డ్రైన్‌పై తీవ్ర ఒత్తిడి ఏర్పడిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం తన ఛాంబర్‌లో యనమదుర్రు డ్రైన్ వరద పరిస్థితులు, ప్రభావిత ప్రాంతాలు, పంట నష్టాలు, ప్రస్తుత నీటిమట్టాలు, వరద నీటి తొలగింపు పురోగతిపై వివరాలను వెల్లడించారు.

నిర్దేశిత సామర్థ్యానికి మించి వరద ప్రవాహం

నవంబర్ 4వ తేదీ నుంచి యనమదుర్రు డ్రైన్‌కు ఎర్రకాలువ, బిన్నేరు, పులివాగు తదితర వాగుల నుంచి భారీ వరద ప్రవాహాలు వచ్చి చేరాయని వివరించారు. ఎర్రకాలువ నుంచి గరిష్టంగా 27,848 క్యూసెక్కులు, బిన్నేరు, పులివాగు తదితర స్థానిక వాగుల నుంచి సుమారు 15,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందన్నారు.దీంతో నందమూరు ఆక్విడెక్ట్ వద్ద మొత్తం వరద ప్రవాహం 42,848 క్యూసెక్కులకు చేరుకుందని తెలిపారు. యనమదుర్రు డ్రైన్ తొలి భాగం నిర్దేశిత నీటి ప్రవాహ సామర్థ్యం 20,250 క్యూసెక్కులు కాగా, మొత్తం వరద ప్రవాహం ఈ సామర్థ్యాన్ని గణనీయంగా మించిపోయిందన్నారు. డ్రైన్ యొక్క నిర్దేశిత సామర్థ్యం 20,250 నుంచి 23,000 క్యూసెక్కుల వరకు ఉండగా, అంతకుమించిన వరద ఉధృతి కారణంగా డ్రైన్ పరివాహక ప్రాంతాల్లో తీవ్ర వరద పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు.నవంబర్ 6వ తేదీన నందమూరు ఆక్విడెక్ట్ వద్ద గరిష్ట వరద ప్రవాహం నమోదైందని, అక్కడ వరద నీటిమట్టం ప్రమాదకర స్థాయి అయిన +38.00 అడుగులను దాటి +40.00 అడుగులకు చేరుకుందని తెలిపారు. అదేవిధంగా దువ్వ రెగ్యులేటర్ వద్ద ప్రమాదకర స్థాయి +31.30 అడుగులు కాగా, గరిష్టంగా +32.80 అడుగుల నీటిమట్టం నమోదైందన్నారు.

దువ్వ రెగ్యులేటర్ ద్వారా భారీగా వరద నీటి విడుదల

దువ్వ రెగ్యులేటర్ ద్వారా గరిష్టంగా 22,662 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. కొవ్వాడ కాలువ నుంచి కూడా సుమారు 12,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందన్నారు. వరద ఉధృతిని నియంత్రించేందుకు డ్రైన్ వ్యవస్థ ద్వారా నిరంతరాయంగా నీటిని సముద్రంలోకి మళ్లించే చర్యలు చేపట్టినట్లు వివరించారు.ఈ వరదల సమయంలో ఇప్పటివరకు దాదాపు 10 టీఎంసీల వరద నీటిని యనమదుర్రు డ్రైన్ ద్వారా సముద్రంలోకి విడుదల చేసినట్లు తెలిపారు.

ప్రస్తుతం నందమూరు ఆక్విడెక్ట్ వద్ద నీటిమట్టం +34.40 అడుగులకు, దువ్వ రెగ్యులేటర్ వద్ద +30.40 అడుగులకు తగ్గిందని పేర్కొన్నారు. దువ్వ రెగ్యులేటర్ వద్ద ప్రస్తుతం 17,882 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోందని తెలిపారు. గరిష్ట స్థాయిలతో పోలిస్తే నీటిమట్టాలు క్రమంగా తగ్గుతున్నాయని వివరించారు.

భారీ వరద ఉధృతితో డ్రైన్ కట్టలకు నష్టం

అసాధారణ స్థాయిలో వరద నీరు ప్రవహించడం వల్ల యనమదుర్రు డ్రైన్ వ్యవస్థలోని పలు ప్రాంతాల్లో మౌలిక వసతులకు నష్టం వాటిల్లిందని కలెక్టర్ తెలిపారు. యనమదుర్రు డ్రైన్ కుడి కట్టకు కిలోమీటర్ 4.150 వద్ద గండి పడిందని వివరించారు. కిలోమీటర్ 4.500 నుంచి కిలోమీటర్ 9.500 మధ్య ఎడమ కట్టపై నుంచి వరద నీరు ప్రవహించిందన్నారు. ఉండి కాలువ కట్టలు, హెడ్ స్లూయిజ్ పొర్లిపోవడంతో పాటు వీ అండ్ డబ్ల్యూ కాలువ కట్టలపై నుంచి కూడా నీరు ప్రవహించిందని తెలిపారు.అదేవిధంగా కిలోమీటర్ 17.230 వద్ద ఉన్న ఆరుదలకోడు ఇన్‌లెట్ షట్టర్ దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు.

కొవ్వాడ కాలువ నుంచి వచ్చిన వరద నీరు, బ్యాక్‌వాటర్ ప్రభావం, చెట్టిపేట వియర్ ద్వారా వెనక్కి వచ్చిన నీటి ప్రవాహాల కారణంగా గోదావరి పశ్చిమ డెల్టా పరిధిలోని పలు కాలువలు పూర్తి సరఫరా స్థాయి (ఎఫ్ఎస్ఎల్) కంటే పైకి ప్రవహించాయని తెలిపారు. భారీ వరద ఉధృతి కారణంగా డెల్టా పరిధిలోని కాలువలు, ఉప కాలువలు పొంగి ప్రవహించాయని వివరించారు.

సుమారు 60 వేల ఎకరాల్లో పంట నష్టం అంచనాభారీ వరదల కారణంగా వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 40,000 ఎకరాల వ్యవసాయ భూమి పూర్తిగా దెబ్బతినగా, మరో 20,000 ఎకరాల్లో పంటలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అంచనా వేసినట్లు వెల్లడించారు. వరద నీరు పొలాల్లో నిలిచిపోవడం, పంటలు నీట మునగడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టాల వివరాలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

వరద ప్రభావిత మండలాలు, గ్రామాలు

యనమదుర్రు డ్రైన్ వరద ఉధృతి కారణంగా జిల్లాలోని పలు మండలాలు, గ్రామాలు ప్రభావితమైనట్లు కలెక్టర్ వివరించారు.

1. తాడేపల్లిగూడెం మండలం:

నందమూరు, అరుళ్ల, జగన్నాథపురం, మరంపల్లి గ్రామాలు.

2. పెంటపాడు మండలం:

బి. కొండేపాడు, మీనవల్లూరు, రామచంద్రాపురం గ్రామాలు.

3. తణుకు మండలం:

దువ్వ, కోనల, ముద్దపురం గ్రామాలు.

4. ఆకివీడు / అత్తిలి మండలాలు:

తిరుపతిపురం, బలిపాడు, వారిగెడు గ్రామాలు.

5. గణపవరం మండలం:

పిప్పర, మొయ్యేరు, కొమర్రు, కేశవరం, ఎస్. కొండేపాడు గ్రామాలు.

6. పాలకోడేరు మండలం:

మైపా, మొగోళ్ళు, పాలకోడేరు, కోరుకొల్లు గ్రామాలు.

7. ఉండి మండలం:

యెండగండి గ్రామం.

8. భీమవరం మండలం:

భీమవరం పట్టణం, యనమదుర్రు, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప గ్రామాలు.

వరద నీరు క్రమంగా తగ్గుముఖం కలెక్టర్ వెల్లడి

ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటిమట్టాలు క్రమంగా తగ్గుతున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.తాడేపల్లిగూడెం మండలంలోని నందమూరు, అరుళ్ల, జగన్నాథపురం, మరంపల్లి గ్రామాలతో పాటు తణుకు మండలంలోని దువ్వ, కోనల, ముద్దపురం గ్రామాల్లో ఈరోజు నాటికి వరద నీటి ముంపు గణనీయంగా తగ్గిపోయిందని వెల్లడించారు.పెంటపాడు మండలంలోని బి. కొండేపాడు, మీనవల్లూరు, రామచంద్రాపురం గ్రామాలతో పాటు అత్తిలి మండలంలోని తిరుపతిపురం, బలిపాడు, వారిగెడు గ్రామాల్లో రేపు సాయంత్రానికి వరద నీటి ముంపు తగ్గే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు.అదేవిధంగా రానున్న ఒకటి, రెండు రోజుల్లో గణపవరం మండలంలోని పిప్పర, మొయ్యేరు, కొమర్రు, కేశవరం, ఎస్. కొండేపాడు గ్రామాలు; పాలకోడేరు మండలంలోని మైపా, మొగోళ్ళు, పాలకోడేరు, కోరుకొల్లు గ్రామాలు; ఉండి మండలంలోని యెండగండి గ్రామం; భీమవరం పట్టణంతో పాటు యనమదుర్రు, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప గ్రామాల్లో కూడా వరద నీటి ముంపు పూర్తిస్థాయిలో తగ్గే అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు.

పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ యనమదుర్రు డ్రైన్‌కు వచ్చిన భారీ వరద ప్రవాహాల నేపథ్యంలో నీటి మట్టాలు, ప్రవాహాల స్థితిగతులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వరద నీటిని సముద్రంలోకి మళ్లించే ప్రక్రియ కొనసాగుతోందని, ప్రభావిత ప్రాంతాల్లో నీటి ముంపు తగ్గుదల ఆధారంగా తదుపరి పరిస్థితిని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. వరద ప్రభావిత గ్రామాల్లో పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్లలో ఘనంగా దీపావళి వేడుకలు

- లబ్ధిదారులతో కలిసి దీపాలు వెలిగించి క్రాకర్స్ కాల్చిన ఎమ్మెల్యే.

- స్వీట్లు తినిపించి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి..



స్టేషన్ ఘనపూర్ నవంబర్ 09 సొంత ఇంటి కల నెరవేరడంతో పేద కుటుంబాలలో ఈ దీపావళి మరింత ఆనందాన్ని, సరికొత్త వెలుగులను తీసుకువచ్చిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో మరియు ధర్మసాగర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల వద్ద దీపావళి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులతో కలిసి పండుగను జరుపుకున్నారు. నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల ముందు కడియం శ్రీహరి లబ్ధిదారులతో కలిసి ప్రమిదలలో దీపాలు వెలిగించి, బాణసంచా కాల్చి పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. లబ్ధిదారుల కుటుంబాలకు స్వీట్లు తినిపించి దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ వారి ఇళ్లలో సరికొత్త వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీకలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ సొంతింటిలో దీపావళి జరుపుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'మా ఇందిరమ్మ ఇంటిలో దీపావళి' కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లను మంజూరు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని వెల్లడించారు. మొదటి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లను కేటాయించినట్లు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 5వేల 500 ఇళ్ల నిర్మాణానికి 275 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్ల కేటాయింపుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు . పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 వేల కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు.

ధర్మసాగర్ మండలం ముప్పారం మరియు ధర్మసాగర్ లలో నూతనంగా ఇళ్లు పూర్తి చేసుకున్న పేద కుటుంబాలు ఈ రోజు తమ సొంత ఇళ్లలో సంతోషంగా దీపావళి వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లలో ఈ దీపావళి శాశ్వత వెలుగులు నింపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు తమకు సొంతిల్లు కల్పించినందుకు ప్రభుత్వానికి, నిరంతరం అండగా ఉంటున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు రేణుక, ఏలీయా, డిఆర్ డిఏ పీడీ, తహసీల్దార్, ఎంపిడివో ఇతర ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వినతులపై పరిష్కార చర్యలు చేపట్టాలి



- జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు,

ములుగు నవంబర్ 09 ప్రజావాణిలో అందిన ప్రజల వినతులను పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.సోమవారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. అర్జీదారులు తెలిపిన సమస్యలను విని, వారి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్జీలను సంబంధిత శాఖలవారీగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ అవసరమైన వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, తీసుకున్న చర్యల వివరాలను అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు.ప్రజావాణిలో మొత్తం 19 అర్జీలు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 10, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 2, పింఛన్లకు సంబంధించి 2, ఉద్యోగానికి సంబంధించి ఒకటి, ఇతర సమస్యలపై 4 అర్జీలు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

"రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది



- రైతులతో కలిసి మెగా రైతు మేళా కార్యక్రమాన్ని వీక్షించిన ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు,

హన్మకొండ నవంబర్ 09 రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న మెగా రైతు మేళా కార్యక్రమాన్ని వర్ధన్నపేట రైతు వేదికలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, కే.ఆర్ నాగరాజు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా కొడంగల్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించిన మెగా రైతు మేళా కార్యక్రమంలో రైతుల సంక్షేమం, అధునిక వ్యవసాయ పద్ధతులు, సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానం, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు తదితర అంశాలపై వివరాలను పరిశీలించారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతులకు అవసరమైన సాగునీరు, పెట్టుబడి సాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.రైతులకు ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ శిబారాణి రాజేందర్,కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, ఏనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక,మాజీ ఎంజీడీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు,పాక్స్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి,మండల అధ్యక్షులు పోశాల వెంకన్న, పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్, కౌన్సిలర్లు,సర్పంచులు, ఉపసర్పంచులు,ముఖ్య నాయకులు,వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన వేడుకలు



భూపాలపల్లి నవంబర్ 09 జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం స్థానిక శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని స్వామివారిని ప్రార్థించారు.అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ... భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని, ఒకవైపు ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ, మరోవైపు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ప్రజా నాయకులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారని కొనియాడారు.పేద ప్రజల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న నాయకుడిగా గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు.వారి నాయకత్వంలో భూపాలపల్లి నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకుంటూ, సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ పక్షాన మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామని తెలిపారు.....ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య పట్టణ అధ్యక్షుడు దాట్ల శీను దేవన్ వైస్ చైర్మన్ అంబాల శీను జిల్లా ఉపాధ్యక్షుడు భువన సుందర్ లక్ష్మి, శ్రీహరి, కౌన్సిలర్లు బొడ్డు అశోక్, బాడితల స్వామి, అరుణ్ రావు, పొన్నగంటి శీను, రాజు నాయక్, కురిమిళ్ళ శీను, మాకోటి ప్రభాకర్, కో ఆప్షన్ నెంబర్లు సజ్జనపు స్వామి ఆఫీస్ హైమాద్ రేణుక, పైడిపల్లి రమేష్ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, బౌద్ధ విజయ్ రంజిత్ సురేష్ సంతోష్ యువజన కాంగ్రెస్, రజినీకాంత్ చీఫ్× సురేష్, కిషోర్, వినోదు వినోదు, ప్రవీణ్ బాబు, మహేష్ రాజు,శశి, భాస్కర్, అఖిల్, మనీ, శ్రీకాంత్, నాగరాజు, రత్నాకర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలు

- పేద కుటుంబాల సొంతింటి కల నెరవేర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ప్రజా ప్రభుత్వం,

- పర్వతగిరి మండలంలో పండుగ వాతావరణంలో వేడుకలు,

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,



పర్వతగిరి నవంబర్ 09 చీకట్లను చీల్చుకుంటూ వెలుగులు విరజిమ్మే దీపావళి పండుగను పురస్కరించుకొని, పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి మండలంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పటేల్ ఎలేంద్ర నవీన్ స్వగృహంతో పాటు మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇళ్లలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగను మరింత ఆనందంగా జరుపుకునేలా పండుగ వాతావరణాన్ని కల్పించారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల సాకారం కావడం వారి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. సొంతింటి గడపలో దీపాలు వెలిగించుకోవడం, కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకోవడం తమ జీవితాల్లో మరచిపోలేని అనుభూతి అని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. దీపావళి అంటే కేవలం దీపాల పండుగ మాత్రమే కాదని, పేదల జీవితాల్లో చీకట్లను తొలగించి ఆశలు, ఆనందాలు నింపే పండుగ అని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పిందన్నారు. పేద కుటుంబాల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే ప్రజా ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిజమైన సార్థకత అని అన్నారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంతో సొంతింటి కల నెరవేరిన కుటుంబాల్లో పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. అనంతరం పర్వతగిరి మండల కేంద్రంలో ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారదా దేవి గారు, పర్వతగిరి మండల అధ్యక్షురాలు సావిత్రి, కల్లెడ పాక్స్ చైర్మన్ అనిల్ రావు, చౌటపల్లి పాక్స్ చైర్మన్ అత్తి కుమారస్వామి,సర్పంచ్ చిదురు శంకర్, గ్రామశాఖ అధ్యక్షులు సంతోష్,మాజీ జడ్పీటీసీ మెడిశెట్టి రాములు,సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర రావు, సీనియర్ నాయకులు కుందూరు వెంకట్ రెడ్డి,సర్పంచులు,గ్రామశాఖ అధ్యక్షులు,మండల ముఖ్య నాయకులు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవకాశాలు ఉన్నా నీళ్లు ఎత్తడం లేదు

- కేంద్రం కూడా తమాషా చేస్తోంది

- రేవంత్ సర్కార్ పై బీఆర్ఎస్ నేతల ఫైర్,



హైదరాబాద్ నవంబర్ 09 కన్నెపల్లి మేడిగడ్డ బ్యారేజ్ నుండి నీళ్ళు పోతున్నాయి ఎత్తండి అని ఎంత చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం విని పించుకోవడం లేదని బీఆర్ఎస్ నేతలు ఫైర్ అయ్యారు. ఎన్టీఎస్ఏ కూడా రిపోర్ట్ కన్నెపల్లి నుండి నీటిని లిఫ్ట్ చేయచ్చు అని చెప్పిందని, కానీ నీళ్లను ఎత్తకుండా కిందికి వదులుతున్నారని విమర్శించారు. కేసీ ఆర్కు పేరు వస్తుంది అని నీళ్ళు ఎత్తలేదన్నారు. 13.5 దగ్గర నీటి ప్రవాహం ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయవచ్చన్నారు. సోమవారం తెలంగాణ భవన్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎల్బీ నగర్ ఎమ్మె ల్యే సుధీర్ రెడ్డిలు మీడియా సమావేశంలో మాట్లాడారు మేము పోయి నిలదీసిన తర్వాత దేవాదుల ప్రాజెక్టు మోటర్లు ఆన్ చేసి ఒక్క రోజు రెండు రోజు డిచి ఆఫ్ చేశారని తెలిపారు. కనినుండి 120 రోజుల పాటు నీటిని లిఫ్ట్ చేసుకునే అవకాశం మనకు ఉన్నది లిఫ్ట్ చేయ కుండా ఎన్టీఎసీ సాకు చెబుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకుండా తమాషా చేస్తోందన్నారు.రాష్ట్రంలో రైతులు సాగు, తాగు నీటి సరఫరా లేక ఇబ్బందులు పదు తుంటే కేంద్ర మంత్రులు ఏం చేస్తున్నట్లు ఏం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. కేసీఆర్ పెట్టిన ఎస్టీపీల ద్వారా గ్రీన్ వాటర్ సప్లై చేస్తున్నారని, అది మాజీ ముఖ్యమంత్రి ఘనతనే అన్నారు. కేసీఆర్ అన వాళ్లు చెరిపివేయడం సాధ్యం కాదన్నారు. అన్ని మండలాలను ప్రక టించి ఆర్థిక సాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. ఇక సీఎం గద్దం గురించి మాట్లాడుతున్నారు. ఎవరికి నష్టం వచ్చినప్పుడు వాళ్ళు పెం ముతారు తీసేస్తారు. నేను కూడా30ఏండ్లు పెంచాను మొన్న ఆరు ఏండ్లు. తీసేసాను... ఇప్పుడు మళ్ళీ పెంచుతున్నాను అని ఎర్రబెల్లి తెలిపారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి,

- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్,

- జిల్లా, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 84 అర్జీలు,



హన్మకొండ నవంబర్ 09 ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వివిధ సమస్యలపై అందిన అర్జీలను అదనపు కలెక్టర్ స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 39 అర్జీలు అందగా, ఆర్డీవో కార్యాలయాల్లో 6 అర్జీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 39 అర్జీలు (మొత్తం అర్జీలు84)అందాయి. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలపై అందించిన అర్జీల ను వేగవంతంగా పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో ఉండొద్దన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డి ఆర్ డి ఓ మేన శ్రీను, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

41 ఏళ్ల వయసులో సెంచరీ.. జింబాబ్వే క్రికెటర్ ఘనత..

తొలి ఇన్నింగ్స్ రికార్డు రెండో ఇన్నింగ్స్‌కే బద్దలు!

జింబాబ్వే సీనియర్ బ్యాటర్ క్రెయిగ్ ఇర్విన్ అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. వయసు అనేది కేవలం అంకె మాత్రమేనని ఘనంగా చాటిచెప్పాడు. 41 ఏళ్ల వయసులో బ్యాట్ ఝుళిపించి టెస్టు క్రికెట్‌లో అద్భుత సెంచరీ సాధించాడు. షార్జా క్రికెట్ స్టేడియంలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో ఎర్విన్ ఈ అరుదైన ఘనతను అందుకుని సరికొత్త చరిత్ర సృష్టించాడు. తద్వారా టెస్టు క్రికెట్ చరిత్రలోనే సెంచరీ సాధించిన అత్యంత పెద్ద వయస్కుడైన జింబాబ్వే ఆటగాడిగా ఇర్విన్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు.

ఇర్విన్ 41 ఏళ్ల 82 రోజుల వయసులో తన టెస్టు కెరీర్‌లో 5వ శతకాన్ని నమోదు చేశాడు. విశేషమేమిటంటే, ఇదే టెస్టు మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో సీనియర్ ఆటగాడు బ్రెండన్ టేలర్ సాధించిన రికార్డును ఇర్విన్ రెండో ఇన్నింగ్స్‌లోనే బద్దలు కొట్టాడు. ప్రస్తుత శతాబ్దంలో (21వ శతాబ్దం) టెస్టుల్లో సెంచరీ సాధించిన రెండో అత్యంత పెద్ద వయస్కుడైన ఆటగాడిగా కూడా ఇర్విన్ రికార్డుల్లోకెక్కాడు.

ఈ జాబితాలో పాకిస్థాన్ మాజీ సారథి మిస్బా ఉల్ హక్ అగ్రస్థానంలో ఉన్నాడు. మిస్బా 2016లో లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌పై 42 ఏళ్ల 47 రోజుల వయసులో 114 పరుగులు చేశాడు. అంతేకాకుండా, ఇదే ఇన్నింగ్స్ ద్వారా ఇర్విన్ టెస్టుల్లో 2,000 పరుగుల మైలురాయిని కూడా చేరుకున్నాడు. జింబాబ్వే తరఫున ఈ మార్కును దాటిన ఏడో బ్యాటర్‌గా గుర్తింపు పొందాడు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే, బ్యాటర్ల ఆధిపత్యం కొనసాగిన ఈ పోరు డ్రా దిశగా ముగుస్తోంది. ం

తొలి ఇన్నింగ్స్‌లో జింబాబ్వే జట్టు 504 పరుగుల భారీ స్కోరు సాధించింది. బ్రెండన్ టేలర్ 168 బంతుల్లో 131 పరుగులు చేయగా, కెప్టెన్ బ్రయాన్ బెన్నెట్ 128 పరుగులతో రాణించారు. వెస్లీ మధెవెరె అర్ధసెంచరీతో ఆకట్టుకున్నారు. దీనికి సమాధానంగా ఆఫ్ఘనిస్థాన్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 514 పరుగులు చేసి, 10 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని దక్కించుకుంది. ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో సెదిఖుల్లా అటల్ (105), రహ్మానుల్లా జద్రాన్ (113), కెప్టెన్ రహ్మత్ షా (173) అద్భుత సెంచరీలతో చెలరేగారు.

బిజినెస్

అక్టోబర్‌లో అత్యధికంగా అమ్ముడైన టాప్-10 కార్లు ఇవే!



దేశీయ కార్ల విపణిలో మారుతి సుజుకి మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. 2026 అక్టోబర్ నెలలో అత్యధికంగా అమ్ముడైన కారుగా వ్యాగనార్ అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు మారుతి 'బ్రెజా' అనూహ్య వృద్ధిని నమోదు చేసింది. సుమారు 86 శాతం వృద్ధితో ఈ మోడల్ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఫలితంగా ఇప్పటివరకు గట్టి పోటీనిస్తున్న టాటా నెక్సాన్ మూడో స్థానానికి పరిమితమైంది. అక్టోబర్ నెలలో అత్యధికంగా అమ్ముడైన టాప్-10 కార్ల జాబితాలో ఏకంగా ఏడు మారుతి సుజుకి మోడళ్లే ఉండటం విశేషం. అగ్రస్థానంలో వ్యాగనార్ ఈ ఏడాది అక్టోబర్‌లో మారుతి సుజుకి 23,747 వ్యాగనార్ యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే నెలలో నమోదైన 18,970 యూనిట్లతో పోలిస్తే విక్రయాలు 25 శాతం వృద్ధి చెందాయి. దీంతో దేశంలో అత్యధికంగా అమ్ముడైన కారుగా వ్యాగనార్ తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. పుంజుకున్న బ్రెజా.. నెక్సాన్ వెనుకంజ మారుతి బ్రెజా అమ్మకాల్లో భారీ పురోగతి సాధించింది. గతేడాది అక్టోబర్ గణాంకాలతో పోలిస్తే ఏకంగా 86 శాతం వృద్ధితో 22,436 యూనిట్లను విక్రయించి రెండో స్థానానికి చేరింది. కాగా, టాటా నెక్సాన్ 21,960 యూనిట్ల విక్రయాలతో మూడో స్థానానికి పరిమితమైంది. గతేడాదితో పోలిస్తే దీని విక్రయాలు ఒక శాతం మేర తగ్గుముఖం పట్టాయి. టాప్-10లో మారుతి హవా ఈ జాబితాలో నాలుగో స్థానంలో మారుతి బాలెనో (20,919), ఐదో స్థానంలో డిజైర్ (20,649), ఆరో స్థానంలో ఎర్టిగా (20,641) నిలిచాయి. టాటా పంచ్ 20,525 యూనిట్లతో ఏడో స్థానాన్ని దక్కించుకోగా, మారుతి ఫ్రాంక్స్ 20,014 యూనిట్లతో ఎనిమిదో స్థానంలో ఉంది. హ్యుందాయ్ క్రెటా 19,353 యూనిట్ల విక్రయాలతో తొమ్మిదో స్థానాన్ని సాధించింది. ఇక 18,866 యూనిట్ల విక్రయాలతో మారుతి స్విఫ్ట్ పదో స్థానంలో నిలిచింది. స్విఫ్ట్ విక్రయాలు గతేడాదితో పోలిస్తే 21 శాతం పెరగడం గమనార్హం.

తొలి రోజే జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు భారీ స్పందన.. 2.5 రెట్లు సబ్‌స్క్రిప్షన్



జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు తొలిరోజే భారీ స్పందన లభించింది. రూ.30,213 కోట్ల విలువైన ఈ పబ్లిక్ ఇష్యూకు బుధవారం మధ్యాహ్నం 3.15 గంటల సమయానికి 2.5 రెట్ల బిడ్లు వచ్చాయి. దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్‌గా నిలిచిన ఈ ఐపీఓ అక్టోబర్ 23 వరకు అందుబాటులో ఉంటుంది.బీఎస్ఈ గణాంకాల ప్రకారం.. ఆఫర్‌లో 19.75 కోట్ల షేర్లు ఉండగా, 49.56 కోట్ల షేర్ల కోసం బిడ్లు దాఖల య్యాయి. సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి అత్యధిక స్పందన వచ్చింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ) విభాగం 7.46 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. సంస్థాగతేతర పెట్టుబడిదారుల విభాగానికి 1.32 రెట్ల బిడ్లు వచ్చాయి. రిటైల్ పెట్టుబడిదారుల విభాగం మాత్రం 60 శాతమే సబ్‌స్క్రైబ్ అయింది.రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదారుల కోసం కేటాయించిన విభాగం 1.16 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ విభాగంలో అందుబాటులో ఉన్న 2.23 కోట్ల షేర్లకు గానూ 2.59 కోట్ల షేర్ల కోసం బిడ్లు వచ్చాయి. ఉద్యోగుల కోసం కేటాయించిన విభాగం కూడా పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది.ఐపీఓకు ముందు జియో ప్లాట్‌ఫామ్స్ 212 మంది యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.8,109.84 కోట్లు సమీకరించింది. సింగపూర్‌కు చెందిన జీఐసీ, నార్జెస్ బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ సహా పలు అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, హెచ్‌డీఎఫ్‌సీ, నిప్పాన్ ఇండియా వంటి దేశీయ సంస్థలూ పెట్టుబడులు పెట్టాయి.

డాలర్‌పై రూపాయి జోరు.. ఒక్కరోజే 25 పైసలు బలోపేతం!



అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ పెరిగింది. సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో 25 పైసలు లాభపడి 93.68 స్థాయికి చేరింది. అంత ర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం మెరుగుపడటం, పశ్చి మాసియాలో ఉద్రిక్తతలు తగ్గవచ్చన్న ఆశలు రూపా యికి అండగా నిలిచాయి.గత వారం కూడా రూపా యి బలమైన ప్రదర్శన కనబరిచింది. 2026లోనే అత్యుత్తమ వారపు లాభాన్ని నమోదు చేస్తూ దాదాపు ఒక శాతం పుంజుకుంది. ఏప్రిల్ తర్వాత అత్యధిక స్థాయికి చేరింది. శుక్రవారం ఒక్కరోజే 43 పైసలు పెరిగి డాలర్‌తో పోలిస్తే 93.98 వద్ద ముగిసింది. సోమవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి 93.90 సమీపంలో ప్రారంభమై 93.70 స్థాయిలో ట్రేడవుతోంది. రూపాయి పుంజుకోవడానికి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు సుమారు 1.5 బిలియన్ డాలర్లు రావడం, అమెరికా డాలర్ బలహీనపడటం, చమురు ధరలు తగ్గడం కూడా దోహదపడ్డాయి. మరోవైపు సోమవారం బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 98.17 డాలర్ల వద్ద ట్రేడవుతూ 0.15 శాతం తగ్గింది. ఇరాన్ అణు కార్యక్రమం, హర్ముజ్ జలసంధిపై చర్చల్లో గణనీయమైన పురోగతి సాధిస్తే మరిన్ని సైనిక దాడులు జరిగే అవకాశం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వారాంతంలో సంకేతాలివ్వడం మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగు పరిచింది. అయితే అమెరికాలో ఉద్యోగ గణాంకాలు అంచనాలను మించడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచవచ్చన్న అంచనాలు బలపడ్డాయి. డిసెంబరులో వడ్డీ రేటు పెంపునకు 81 శాతం అవకాశముందని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి.

ఖవాజా చెప్పిందంతా నూటికి నూరు శాతం నిజం.. 'శాండ్‌పేపర్ గేట్'పై నోరు విప్పిన వార్నర్



ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన 2018 శాండ్‌పేపర్ గేట్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ ఘటనపై ఎనిమిదేళ్లుగా మౌనంగా ఉన్న ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్, ఎట్టకేలకు తన మౌనాన్ని వీడాడు. ఈ వివాదంపై ఇటీవల ఉస్మాన్ ఖవాజా చేసిన వ్యాఖ్యలకు పూర్తి మద్దతు ప్రకటి ంచాడు. ఖవాజా చెప్పిందే నూటికి నూరు శాతం నిజమని, నిజానిజాలు బయటకు రావాల్సిన సమ యం ఆసన్నమైందని వార్నర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను పంచుకున్నాడు. దర్యాప్తు ఓ ప్రహసనం ఈ వివాదంపై అప్పట్లో జరిగిన విచారణ ప్రక్రియను వార్నర్ తీవ్రంగా తప్పుబట్టాడు. అది లోపభూ యిష్టంగా, హడావుడిగా జరిగిందని ఆరోపించాడు. "ఈ అంశంపై మాట్లాడి ఎనిమిదేళ్లు అవుతోంది. ఉస్మాన్ ఖవాజాకు నా పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాను. నువ్వు చెప్పింది 100 శాతం నిజం. ఇప్పుడు అందరికీ నిజం తెలిసింది. ఎనిమిదేళ్ల తర్వాత ఎందుకు మాట్లాడుతున్నారని కొందరు ప్రశ్నిస్తు న్నారు. కానీ ఇది ఉస్మాన్ కథ, అతను నమ్మిన విషయం. అప్పట్లో కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ పక్కనే ఉస్మాన్ కూర్చున్నాడు. కానీ అతడిని విచారించలేదు. ఇది ఎలాంటి సమగ్ర విచారణో నాకైతే అర్థం కావడం లేదు" అని వార్నర్ నిలదీశాడు. కుటుం బంపై తీవ్ర ప్రభావం వివాదం తన కుటుంబంపై చూపిన ప్రభావం గురించి వార్నర్ భావోద్వేగంగా మాట్లాడాడు. ఇటీవలే తన కుమార్తెలకు ఈ ఘటన గురించి వివరించాల్సి వచ్చిందని తెలిపాడు. "గత రెండు రోజులుగా నా కుమార్తెలకు అసలేం జరిగిందో వివరిస్తున్నాను. ముఖ్యంగా నా 12 ఏళ్ల కుమార్తె ఐవీ, అప్పట్లో మా చుట్టూ అన్ని కెమెరాలు ఎందుకున్నాయని, మేం టీవీలో ఎందుకు ఏడ్చామని అడిగింది. అది చెప్పడం చాలా కష్టంగా అనిపిం చింది. కానీ, 'అమ్మాయిలూ, ఎప్పుడూ నిజమే చెప్ప ండి, ఎందుకంటే అబద్ధాలు ఏదో ఒకరోజు బయట పడతాయి' అని వారికి చెప్పాను" అని వార్నర్ పేర్కొ న్నాడు. ఈ కష్టకాలంలో తన కుటుంబంతో పాటు స్టీవ్ స్మిత్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ కుటుంబాలు కూడా ఎంతో నరకాన్ని అనుభవించాయని గుర్తుచేసు కున్నాడు. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్ సందర్భంగా శాండ్ పేపర్ తో బంతి ఆకా రాన్ని మార్చేందుకు ప్రయత్నించిన ఘటన ఆస్ట్రేలి యా క్రికెట్‌లో పెను దుమారం రేపింది. ఈ ఘటన లో స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ మాత్రమే దోషులని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తేల్చి ంది.

స్పోర్ట్స్

అమృత్‌సర్‌లో దీపావళి సంబరాలు.. సోషల్ మీడియాలో అభిషేక్ శర్మ డ్యాన్స్ వీడియో వైరల్!



టీమిండియా యువ క్రికెటర్, వరల్డ్ నెం.1 టీ20 బ్యాటర్ అభిషేక్ శర్మ తన కుటుంబంతో కలిసి దీపావళి పండుగను ఘనంగా జరుపు కున్నాడు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న తన నివాసంలో కుటుంబ సభ్యుల మధ్య సందడి చేశాడు. ఈ వేడుకలకు సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిషేక్ సోదరి కోమల్ శర్మ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ వీడియోను పోస్ట్ చేశారు. ఇందులో అభిషేక్ తన తల్లిదండ్రులు, బంధుమిత్రులతో కలిసి ప్రముఖ గాయకుడు దలేర్ మెహందీ పాడిన 'బోలో త ర ర' పాటకు ఉత్సా హంగా డాన్స్ చేస్తూ కనిపించాడు. ఈ వీడియోకు ఆమె "'బోలో త ర ర... (ఇది మా ఇంట్లో తప్పనిసరి కార్యక్రమం) అని క్యాప్షన్ జోడిం చారు. పండుగ దీపాల వెలుగులో, సంప్రదాయ దుస్తులు ధరించిన అభిషేక్ కుటుంబంతో కలిసి స్టెప్పులేయడం అభిమానులను ఆకట్టుకు ంటోంది. దీనితో పాటు తన ఇంట్లో జరిగిన దీపావళి పూజకు సంబంధించిన ఫోటోలను కూడా అభిషేక్ పంచుకున్నాడు.ఇక, క్రికెట్ విషయానికి వస్తే.. అభిషేక్ శర్మ త్వరలో జరగనున్న ఏసీసీ మెన్స్ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌కు ఎంపికయ్యాడు. ఈ నెల 19 నుంచి 29 వరకు దోహా వేదికగా జరిగే ఈ టోర్నీ కోసం ప్రకటించిన 15 మంది సభ్యుల ఇండియా ఏ జట్టులో అతనికి చోటు దక్కింది. ఈ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, రింకూ సింగ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ వంటి ఆటగాళ్లు కూడా ఉన్నారు. గ్రూప్-బిలో ఉన్న ఇండియా-ఏ జట్టు... యూఏఈ, నేపాల్, పాకిస్థాన్-ఏ జట్లతో తలపడనుంది.

ఒకవైపు గాయాలు.. మరోవైపు భారత్ జోరు.. కివీస్‌కు కఠిన పరీక్ష!



న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా మరో విజయానికి సిద్ధమైంది. ఇప్పటికే వరు సగా రెండు వన్డేల్లో గెలిచి 2-0తో ఆధిక్యంలో ఉన్న భారత జట్టు.. మంగళవారం జరిగే మూడో వన్డేలోనూ విజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సొంతం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. హామిల్టన ్‌లోని సెడ్డన్ పార్క్ వేదికగా జరగనున్న ఈ పోరులో ఆతిథ్య న్యూజిలాండ్‌కు మాత్రం చావోరేవో పరిస్థితి. ఈ మ్యాచ్‌లో ఓడితే సిరీస్ చేజారినట్లే. మరోవైపు కీలక ఆటగాళ్ల గాయాలతో కివీస్ సతమతమవుతోంది. ఈ పరిస్థితుల్లో సొంతగ డ్డపై భారత్‌ను అడ్డుకోవడం శాంట్నర్ సేనకు పెద్ద సవాలే.ఈ సిరీస్‌లో భారత బౌలర్లే ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నారు. పేస్ దళం ధాటికి కివీస్ బ్యాటర్లు పరుగులు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. తొలి వన్డేలో 185 పరుగులకే కట్టడి కాగా.. రెండో మ్యాచ్‌లో 134 పరుగులకే కుప్పకూలింది. ముఖ్యంగా రెండో వన్డేలో గుర్నూర్ బ్రార్ 30 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. అన్షుల్ కాంబోజ్, అక్షర్ పటేల్ కూడా కీలక సమయాల్లో వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బకొట్టారు. ఈసారి కూడా ఇదే జోరు కొనసాగించాలని భారత్ భావిస్తోంది. మరోవైపు న్యూజిలాండ్ బ్యాటింగ్ విభాగం తీవ్ర ఒత్తిడిలో ఉంది. రెండో వన్డేలో డారిల్ మిచెల్ (55), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (31) మినహా మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేదు.

బేబీ బంప్ లేటెస్ట్ ఫొటో షేర్ చేసిన సమంత.. నెట్టింట వైరల్

ప్రముఖ నటి సమంత త్వరలోనే మాతృత్వపు మధురిమలను ఆస్వాదించబోతున్నారు. భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి తమ మొదటి సంతానాన్ని ఆహ్వానించేందుకు సిద్ధమవుతున్న ఆమె, తన ప్రెగ్నెన్సీ ప్రయాణానికి సంబంధించిన విశేషాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటున్నారు. తాజాగా సమంత తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో బేబీ బంప్‌తో ఉన్న ఒక సరికొత్త ఫొటోను పోస్ట్ చేశారు. సాధారణంగా సెలబ్రిటీలు మెటర్నిటీ సమయంలో భారీ సెట్టింగులు, డిజైనర్ డ్రెస్సులతో గ్రాండ్‌గా ఫొటోషూట్‌లు చేస్తుంటారు. అయితే సమంత మాత్రం ఎంతో భిన్నంగా, సాధారణ వాతావరణంలో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. ఇంట్లోని సోఫాపై ప్రశాంతంగా కూర్చుని సేదతీరుతున్న ఒక క్యాజువల్ ఫొటోను ఆమె పంచుకున్నారు. రెడ్ కలర్ టాప్, వైట్ ట్రౌజర్ ధరించి, బ్లాక్ సన్‌గ్లాసెస్‌తో చాలా కూల్‌గా ఉన్న లుక్‌లో బేబీ బంప్‌ను సున్నితంగా పట్టుకుని ఆమె కనిపించారు. ఈ ఫొటోకు "దీనినే నా మెటర్నిటీ షూట్‌గా భావించండి" అంటూ ఒక సరదా క్యాప్షన్ జోడించారు. సమంత పోస్ట్ చేసిన ఈ ఫొటో కొద్దిసేట్లోనే నెట్టింట వైరల్‌గా మారింది. అభిమానులు, నెటిజన్లు పెద్ద సంఖ్యలో స్పందిస్తూ ఆమెపై ప్రేమను కురిపించారు. "ఇప్పటివరకు చూసిన వారిలో అత్యంత కూలెస్ట్ కాబోయే తల్లి" అని ఒక అభిమాని ప్రశంసించగా.. "పుట్టబోయే బిడ్డ ఇప్పుడే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది", "త్వరలోనే జూనియర్ సమంత రాబోతోంది" అంటూ పలువురు నెటిజన్లు కామెంట్ల రూపంలో తమ శుభాకాంక్షలు తెలిపారు. సమంత, రాజ్ నిడిమోరుల వివాహం 2025 డిసెంబర్ 1న కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగింది. ఈ క్రమంలోనే కొన్ని వారాల క్రితం ఈ దంపతులు కోయంబత్తూరు ఈశా ఫౌండేషన్‌లోనే సంప్రదాయ పద్ధతిలో సీమంతం వేడుకను కూడా నిర్వహించారు. అంతకుముందు, 2026 జూన్‌లో హైదరాబాద్‌లో జరిగిన 'మా ఇంటి బంగారం' సినిమా సక్సెస్ మీట్ వేదికగా సమంత తన ప్రెగ్నెన్సీ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అప్పటికే అంగీకరించిన ప్రాజెక్టులను పూర్తి చేసిన తర్వాత, జీవితంలో ఎదురవుతున్న ఈ అద్భుతమైన కొత్త దశను ఆస్వాదించేందుకు కొంతకాలం పాటు సినిమాలకు దూరంగా ఉండనున్నట్లు ఆమె వెల్లడించారు. అయితే ఇది కేవలం తాత్కాలిక విరామం మాత్రమేనని, మాతృత్వపు బాధ్యతలను స్వీకరించిన అనంతరం మళ్లీ వెండితెరపైకి రీఎంట్రీ ఇస్తానని సమంత స్పష్టం చేశారు.



గంటలోనే 'జూడీ జోడీ' పాట.. ఆసక్తికర విషయం చెప్పిన చిన్మయి

ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాద ఒక ఆసక్తికరమైన అంశాన్ని వెల్లడించింది. నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రామాయణ: పార్ట్ 1' చిత్రంలోని 'జూడీ జోడీ' అనే గీతాన్ని చెన్నైలో నిర్వహించిన ఆడియో విడుదల వేడుకలో ఆమె ప్రత్యక్షంగా ఆలపించింది. అయితే, ఆ ప్రదర్శనకు కేవలం గంట ముందు మాత్రమే తాను ఆ పాటను నేర్చుకున్నట్లు ఆమె పేర్కొంది. ఈ పాట హిందీ వెర్షన్‌ను ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ ఆలపించగా, చిన్మయి లైవ్ ప్రదర్శనను కొందరు నెటిజన్లు ఆమెతో పోల్చారు. ఈ నేపథ్యంలోనే చిన్మయి 'ఎక్స్' వేదికగా స్పందించింది. "వేదికపైకి వెళ్లడానికి గంట ముందు మాత్రమే ఈ పాటను నేర్చుకున్నాను. ఇలాంటి అవకాశం రావడం సంతోషకరం. గంటల తరబడి సాధన చేసి 'కంఫర్ట్ జోన్'లో ఉండటం కంటే, ఇలాంటి సవాళ్లను స్వీకరించడమే నాకు ఇష్టం" అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొంది. తాను ఎల్లప్పుడూ స్వీయ విమర్శ చేసుకుంటానని, తనలో ఒక కఠినమైన అంతర్గత స్వరం వినిపిస్తుంటుందని చిన్మయి తెలిపింది. సుమారు 25 ఏళ్లుగా వృత్తిపరమైన గాయనిగా కొనసాగుతున్నప్పటికీ, కెరీర్ ఆరంభంలో ఉన్నంత ఆత్మవిశ్వాసం ఇప్పటికీ ఉందని, 'ఇంపోస్టర్ సిండ్రోమ్'తో బాధపడుతున్నానని ఆమె వెల్లడించింది. ఒక కొత్త పాటతో మమేకం కావడానికి కొంత సమయం పడుతుందని, అయితే తనకు గానం పట్ల ఉన్న మక్కువనే అన్నింటికంటే ముఖ్యమని ఆమె వివరించింది.



బాలీవుడ్, సౌత్ చిత్ర పరిశ్రమల తేడాలను చెప్పిన కీర్తి సురేశ్

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తన అద్భుత నటనతో గుర్తింపు తెచ్చుకున్న జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్, త్వరలో బాలీవుడ్‌లోనూ అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సౌత్ ఇండస్ట్రీకి, హిందీ చిత్ర పరిశ్రమకు మధ్య ఉన్న పనితీరు తేడాలపై ఆమె ఆసక్తికర విషయాలను వెల్లడించి ంది. బాలీవుడ్‌లో ప్రి-ప్రొడక్షన్‌కు అత్యధిక ప్రాధా న్యం ఇస్తే, దక్షిణాది చిత్ర పరిశ్రమలో మాత్రం పనితీరు చాలా సహజంగా (స్పాంటేనియస్‌గా) సాగుతు ందని వివరించింది.ఎతాజాగా తాను నటించిన 'అక్క' మూవీ ప్రమోషన్లలో భాగంగా సహ నటి రాధికా ఆప్టేతో కలిసి పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో కీర్తి మాట్లాడింది. "బాలీవుడ్‌లో వర్కింగ్ స్టైల్ చాలా భిన్నంగా ఉంటుంది. స్క్రిప్ట్ రీడింగ్స్, నటీనటులకు ముందస్తు శిక్షణ, ఇతర నటీనటులతో సమన్వయం వంటి ప్రి-ప్రొడక్షన్ పనులకు ఇక్కడ ఎక్కువ సమయం కేటాయిస్తారు. అదే సౌత్ విషయానికి వస్తే చాలావరకు స్పాంటేనిటీ కనిపిస్తుంది. ప్రత్యేకమైన పాత్రల కోసం ఎక్కువ కసరత్తు చేయాల్సి వస్తే తప్ప, సాధారణంగా పెద్దగా ప్రిపరేషన్ ఉండదు. కొన్నిసార్లు ఇతర నటీనటులను నేరుగా షూటింగ్ రోజే సెట్స్‌లో కలుస్తుంటాం. అయితే, ఈ రెండు పద్ధతుల్లో పనిచేయడం నాకు ఎంతో ఇష్టం" అని కీర్తి సురేశ్ వివరించింది. ధర్మరాజ్ శెట్టి దర్శకత్వం వహించిన 'అక్క' చిత్రాన్ని వైఆర్ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. తన్వి అజ్మీ, మహేశ్ మంజ్రేకర్, అన్నమన్ పుష్కర్, మోనికా పన్వార్ తదితరులు ఇందులో కీలక పాత్రల్లో నటించారు. ఈ కథలో తాను పోషించిన 'భవాని' పాత్ర గురించి కీర్తి మాట్లాడుతూ.. తన వారస త్వాన్ని కాపాడుకోవడానికి ఎంతటి కఠిన నిర్ణయాలైనా తీసుకునే బలమైన మహిళగా భవాని కనిపిస్తుందని తెలిపింది. రాధికా ఆప్టేతో కలిసి పనిచేయడం గొప్ప అనుభవమని, నెట్‌ఫ్లిక్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ప్రాజెక్ట్ అందరినీ ఆకట్టుకుంటోందని తెలిపింది.



అడవిలో కాలుపెడితే అదృశ్యమే: ఓటీటీలో 'ది వన్'



అది ఒక దట్టమైన అడవి .. పొద్దుపోయిన తరువాత ఆ అడవి వైపు ఎవరూ వెళ్లరు. ఏం కాదులే అంటూ అటుగా వెళ్లిన వాళ్లెవరూ తిరిగి రాలేదు. అడవిలో వనదేవత విహరిస్తూ ఉంటు ందనీ .. ఆ సమయంలో ఎవరైనా అటుగా వెళితే చంపేస్తు ందని అంతా భావిస్తుంటారు. అలాంటి పరిస్థితు లలో 'రిషి' తన భార్య 'మమత'ను తీసుకుని ఆ గ్రామానికి చేరుకుంటాడు. తన పూర్వీకులకు సంబంధించిన ఆస్తిపాస్తులను అమ్ముకుని వెళ్లడానికి వస్తాడతను. తాను వచ్చిన పనిని పూర్తి చేయడానికి అడ్డుగా ఉన్న అడవిని టచ్ చేయడానికి అతను సిద్ధపడతాడు. ఆ గ్రామస్తులంతా కూడా ఆ అడవి వనదేవత నివాసమనీ, అలాంటి అడవి జోలికి వెళితే వనదేవతకి ఆగ్రహం కలుగుతుందని రిషికి చెబుతారు. అదంతా ఒక మూఢనమ్మకం అని భావించిన రిషి లైట్ తీసుకుంటాడు. తాను అనుకున్న పనిని పూర్తి చేసే తిరిగి వెళ్లాలని నిర్ణయించుకుంటాడు. అప్పటి నుంచి అతనికి ఎలాంటి చిత్రమైన అనుభవాలు ఎదురవుతాయి? దాంతో అతను తన నిర్ణయాన్ని మార్చుకుంటాడా? మూర్ఖంగా ముందుకు వెళతాడా? అనేది కథ. ఈ కథ అంతా కూడా 'ది వన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే సినిమాకి సంబంధించినది. అడ్వెంచర్ తో ముడిపడిన హారర్ యాక్షన్ మూవీ ఇది. ఏక్తా కపూర్ - శోభా కపూర్ నిర్మించిన ఈ సినిమాకి, దీపక్ మిశ్రా దర్శకత్వం వహించాడు. సిద్ధార్థ్ మల్హోత్రా - తమన్నా ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, సెప్టెంబర్ 25వ తేదీన థియేటర్లకు వచ్చింది. అమిత్ త్రివేది - సామ్ సీఎస్ నేపథ్య సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, ఈ నెల 6వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది.

'పుష్ప 2', 'ధురంధర్ 2' రికార్డులు బ్రేక్.. బుకింగ్స్ లో 'రామాయణ' సంచలనం!

భారత సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిన 'రామాయణ: పార్ట్ 1' చిత్రం సంచలనాలు సృష్టిస్తోంది. రణ్‌బీర్ కపూర్, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా, టికెట్ అమ్మకాల్లో సరికొత్త ఆల్-టైమ్ రికార్డును నెలకొల్పింది. ముఖ్యంగా ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ 'బుక్‌మైషో'లో గంట వ్యవధిలో అత్యధిక టికెట్లు అమ్ముడైన సినిమాగా నిలిచి, ఇప్పటివరకు ఉన్న అన్ని రికార్డులను బద్దలు కొట్టింది.విడుదలకు ముందు 'ధురంధర్ 2' చిత్రంతో పోలిస్తే 'రామాయణ'కు అడ్వాన్స్ బుకింగ్స్ కొంత బలహీనంగానే మొదలయ్యాయి. అయితే, సినిమా విడుదలైన తర్వాత మంచి స్పందనతో పుంజుకుంది. దీపావళి పండుగ సెలవులు ఈ చిత్రానికి భారీగా కలిసొచ్చాయి. సినిమా విడుదలైన ఐదవ రోజైన ఇవాళ ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య కేవలం గంట వ్యవధిలో 1.10 లక్షల టికెట్లు అమ్ముడయ్యాయి. 2023 ఆగస్టు నుంచి అందుబాటులో ఉన్న గంటలవారీ ట్రాకింగ్ రికార్డుల్లో ఈ ఘనత సాధించిన తొలి భారతీయ చిత్రంగా 'రామాయణ' నిలిచింది. ఇప్పటివరకు ఈ రికార్డు రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' (1.09లక్షలు) పేరిట ఉండేది. అంతకుముందు అల్లు అర్జున్ 'పుష్ప 2' (1.07లక్షలు) పేరిట ఉన్న రికార్డును 'ధురంధర్ 2' అధిగమించింది. ఇప్పుడు ఆ రెండు చిత్రాల రికార్డులను 'రామాయణ' చెరిపేసి అగ్రస్థానానికి చేరింది. దీపావళి సెలవుల కారణంగా నిన్నటి కంటే ఈ రోజు టికెట్ అమ్మకాలు ఏకంగా 67% పెరగడం విశేషం. విడుదలైన మొదటి నాలుగు రోజులూ ప్రతిరోజూ 1 మిలియన్ (10 లక్షలకు పైగా) బుక్‌మైషో బుకింగ్స్ సాధించిన ఆరో భారతీయ చిత్రంగా కూడా 'రామాయణ' నిలిచింది.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com